


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 109, పేజీలు - 08
బుధవారం, సెప్టెంబర్ 24, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## తీవ్ర ఆర్థిక సంక్షోభంలో బంగ్లాదేశ్

**- దివాలా బాటలో బంగ్లా బ్యాంకులు**



ఢాకా (ప్రశ్న న్యూస్) పొరుగు దేశం బంగ్లాదేశ్ చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. భారీ ఎత్తున పేరుకుపోయిన మొండి బకాయిలతో దేశ బ్యాంకింగ్ రంగం కుప్పకూలే స్థితికి చేరగా, నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్ఐ) దివాలా అంచున నిలిచాయి. మరోవైపు, స్టాక్ మార్కెట్లో నమోదైన

2లో..

## భారత్-పాక్ యుద్ధాన్ని నేనే ఆపాను

**- ఐరాసలోనూ ట్రంప్ అదే మాట**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన పాత వాదనను పునరుద్ఘాటించారు. ఇటీవల భారత్, పాకిస్థాన్‌ల మధ్య తీవ్రస్థాయికి చేరిన ఘర్షణను తానే నివారించానని, తన వల్లే యుద్ధం ఆగిపోయిందని చెప్పుకొచ్చారు. ఐక్యరాజ్యసమితి (ఐరాస) సర్వసభ్య సమావేశంలో మంగళవారం

2లో..

## కొత్త కొలువుల్లో యువత హవా

**- ఒక్క నెలలో 21 లక్షల మంది కొత్త సభ్యులు**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో ఉపాధి అవకాశాలు పుంజుకుంటున్నాయని సూచిస్తూ ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ)లో కొత్త సభ్యుల చేరిక భారీగా పెరిగింది. ఈ ఏడాది జులై నెలలో రికార్డు స్థాయిలో నికరంగా 21.04 లక్షల మంది కొత్తగా ఈపీఎఫ్ పరిధిలోకి వచ్చారు. గతేడాది జులైతో పోలిస్తే ఇది

2లో..

# మేడారంలో రాతి కట్టడాలు

- జాతర పనులకు శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్ రెడ్డి - -కుంభమేళాకు వేలకోట్లు ఇచ్చారు, మేడారం జాతరకు ఎందుకు ఇవ్వరని ప్రశ్న
- మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించి నిధులివ్వాలి - సమ్మక్క- సారలమ్మ గద్దెల పునఃనిర్మాణం అవకాశం దక్కడం నా అదృష్టం



**సమ్మక్క-సారక్క గద్దెల పుణ్యక్షేత్రమైన మేడారం అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకునేలా రాతికట్టడాలు నిర్మించాలని స్పష్టం చేశారు. రాతితో కట్టిన నిర్మాణాలు వందేళ్లకుపైగా నిలకడగా ఉండగలవని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి సమీక్షా సమావేశంలో ఆలయాభివృద్ధి పనులు వంద రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.**

**మేడారం (ప్రశ్న న్యూస్)** అసలైన అభివృద్ధి అంటే గిరిజనుల జీవనస్థితి మెరుగుపరచడమేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గిరిజనులకు అదనంగా 22 వేల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించామని అని తెలిపారు. దశాబ్దాలపాటు గిరిజనులకు అన్యాయం జరిగిందని, తాము సరిదిద్దాలని భావించామని ఆయన పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వం, పాలనలో గిరిజన బిడ్డలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. సమ్మక్క-



సారలమ్మ గద్దెల పునఃనిర్మాణం అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నిధుల కోసం గతంలో సీతక్క ఇచ్చిన వినతిపత్రాలను అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇప్పుడు సీతక్క నిధులు ఇవ్వటం కాదు ఆ దస్త్రాలపై ఆమె సంతకం పెడుతోందని వెల్లడించారు. గతంలో అభివృద్ధి గురించి నేతలను అడగటమే గగనమైన పరిస్థితి ఉండేదని, నిధులు అడిగితే ఏదో భిక్షం ఇస్తున్నట్లు వ్యవహరించేవారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి అంటే అద్దాల మేడలు, గోడలు మాత్రమే కాదన్న

2లో..

## కోర్టులు రికవరీ ఏజెంట్లు కాదు

**- సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం**

- సివిల్ వివాదంలో ఓ వ్యక్తి క్రిమినల్ కేసు నమోదు
- చట్టం దుర్వినియోగంపై సుప్రీంకోర్టు విమర్శలు
- జిల్లాకు ఓ నోడల్ అధికారిని నియమించాలని సూచన



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** న్యాయస్థానాలు డబ్బులు రికవరీ చేసే ఏజెంట్లు కాదని సుప్రీం కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. సివిల్ వివాదాలను క్రిమినల్ కేసులుగా మార్చే ట్రెండ్‌పై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ కేసు విచారణ సమయంలో పైవిధంగా అత్యున్నత న్యాయస్థానం స్పందించింది. రుణాల రికవరీ వంటి సివిల్ వివాదంలో అరెస్ట్‌ను ఓ సాధానంగా వాడకూడదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ వివాదంపై కిడ్నాప్ కేసు నమోదుచేయడం పట్ల అభ్యంతరం తెలిపింది. ఇటీవల కాలంలో సివిల్ వివాదాలపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తోన్న ఈ ధోరణి చట్టాన్ని

2లో..

## కులగణన సర్వే బయటపెట్టకుండానే

# బీసీ రిజర్వేషన్లు

**- ప్రభుత్వం కుట్ర అని కవిత ఆరోపణలు**

- స్థానిక ఎన్నికల ముందే కులగణన వివరాలు ప్రకటించాలన్న కవిత
- బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపణ
- గ్రామ పంచాయతీల వారీగా వివరాలు వెల్లడించాల్సిందేనని డిమాండ్
- రాజకీయ లబ్ధి కోసం ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు అన్యాయం జరుగుతుందన్న కవిత



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కులగణన సర్వే వివరాలు బయటపెట్టకుండా తెలంగాణ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసే కుట్ర పన్నుతుందని మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలోని కుల గణన సర్వే పూర్తి వివరాలు బయటపెట్టడం లేదని కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఉన్న చోట రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు

2లో..

## పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు లభిస్తుంది

**- ఎన్నికలకు సిద్ధంగా ఉండండి**

2లో..



## ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కావాలనేది

# మనందరి ఆకాంక్ష

- ఆహారమే ఔషధమని ప్రజలకు ఆరోగ్య సూత్రాల వెల్లడి
- ఆరోగ్య సేవలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్న సీఎం
- ప్రతి ఒక్కరికీ రూ. 2.5 లక్షల ఆరోగ్య బీమా హామీ
- రాష్ట్రంలో అందరికీ 41 రకాల వైద్య పరీక్షల నిర్వహణ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి హెల్త్ రికార్డు నమోదు చేయనున్నట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం వైద్యారోగ్యశాఖపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని ప్రతి వ్యక్తి ఆరోగ్య రికార్డు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి వ్యక్తికి 41 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ రికార్డు నమోదు చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తి ఆరోగ్య సమాచారం ప్రభుత్వం వద్ద ఉండేలా చర్యలు

2లో..

## ఢిల్లీలో వేడుకగా జాతీయ అవార్డుల ప్రదానోత్సవం

- ఉత్తమ నటులుగా అవార్డు అందుకున్న షారుఖ్, విక్రాంత్
- మలయాళ నటుడు మోహన్‌లాల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డుల ప్రదానం

2లో..



## పేదరికంపై తెలంగాణ విజయం

- పేదరికం లేని సమాజం దిశగా తెలంగాణ అడుగులు
- ఐదేళ్లలో 14 నుంచి రెండో స్థానానికి - ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ముందంజ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రం పేదరికం నిర్మూలనలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచి సత్తా చాటింది. 'నియో-మిడిల్ క్లాస్' (పేదరికం నుంచి బయటపడి మధ్యతరగతికి చేరువవుతున్న వర్గం)ను సృష్టించడంలో రాష్ట్రం గణనీయమైన ప్రగతి సాధించింది. నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 'పేదరికం లేని సమాజం' అనే లక్ష్యంలో తెలంగాణ 91 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న తమిళనాడుకు చేరువగా నిలిచింది. ఈ విజయం ప్రభుత్వ విధానాలు, సుస్థిర అభివగృద్ధి వల్ల ప్రజల జీవితాల్లో వస్తున్న నిజమైన మార్పును సూచిస్తోంది. భారతదేశ అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంది. వేగవంతమైన వృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా వేలాది మంది ప్రజలను పేదరికం నుంచి 'నియో-మిడిల్ క్లాస్'లోకి మార్చింది. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ఒకటైన 'పేదరికం లేని సమాజం' లక్ష్యాన్ని చేరుకోవడంలో తెలంగాణ అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. 2023-24 సంవత్సరానికిగానూ.. తెలంగాణ ఈ లక్ష్యంలో 91 పాయింట్లు సాధించి దేశంలో రెండో స్థానంలో నిలిచింది. కేవలం తమిళనాడు (92 పాయింట్లు) మాత్రమే తెలంగాణ కంటే ముందుంది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ 86 పాయింట్లతో తెలంగాణకు దగ్గరగా ఉంది.తెలంగాణ సాధించిన ఈ విజయం ప్రభుత్వ విధానాలు,

2లో..

## విశాఖ స్టీల్ ప్లాంట్

# ప్రైవేటీకరణ జరగదు

**- లోకేశ్ కీలక ప్రకటన**

- రూ.11,440 కోట్లతో కేంద్రం పునరుద్ధరణ ప్యాకేజీ ప్రకటించిందని వెల్లడి
- ప్రతిపక్ష వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోందని తీవ్ర విమర్శలు
- మహిళల గౌరవంపై శాసన మండలిలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం



అమరావతి (ప్రశ్న న్యూస్) విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణపై గత కొంతకాలంగా నెలకొన్న ఆందోళనలకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శాసనమండలి వేదికగా తెరదించారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ప్రణాళిక ఏదీ లేదని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కర్మాగారం పునరుద్ధరణ కోసం రూ.11,440 కోట్ల భారీ ప్యాకేజీని ప్రకటించిందని గుర్తుచేశారు. ఈ ప్యాకేజీతో స్టీల్ ప్లాంట్ తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని, ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయంలో చొరవ తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం శాసనమండలిలో

2లో..

## 23 గ్రామాల్లో ఎన్నికలపై స్టే

**- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన సుప్రీంకోర్టు**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లా మంగపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. మండల పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికల నిర్వహణపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పేర్కొంటూ గతంలో హైకోర్టు ప్రకటించగా, ఆయా గ్రామాల గిరిజనేతరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మంగపేట మండలంలోని 23 గ్రామాలు గిరిజన పరిధిలో లేవని 1950లో రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై 2013లో గిరిజన సంఘాలు

2లో..

## హైకోర్టుకు ఐఏఎస్ స్మితా సబర్వాల్

**- జస్టిస్ ఘోష్ రిపోర్టును క్వాష్ చేయాలని పిటిషన్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయంలో స్పెషల్ సెక్రటరీగా పనిచేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పై పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టును క్వాష్ చేయాలని తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ 665 పేజీల రిపోర్టులో తనపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసిన కమిషన్ తన వివరణ

2లో..

# కొత్త కొలువుల్లో యువత హవా

5.55 శాతం అధికమని ఈపీఎఫ్ఓ మంగళవారం విడుదల చేసిన ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. ఉద్యోగ భద్రత, ప్రయోజనాలపై ఉద్యోగుల్లో అవగాహన పెరగడం కూడా ఈ వృద్ధికి కారణంగా నిలుస్తోంది. ఈ గణాంకాలలో అత్యంత ముఖ్యమైన అంశం యువత భాగస్వామ్యం. జులైలో కొత్తగా చేరిన 9.79 లక్షల మంది చందాదారులలో ఏకంగా 61.06 శాతం, అంటే 5.98 లక్షల మంది 18–25 ఏళ్ల మధ్య వయసు వారే కావడం గమనార్హం. వీరిలో ఎక్కువ మంది మొదటిసారిగా వ్యవస్థీకృత రంగంలో ఉద్యోగాల్లోకి అడుగుపెట్టిన వారేనని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇది దేశ శ్రామిక శక్తిలో యువత కీలక పాత్ర పోషిస్తోందనడానికి నిదర్శనంగా నిలుస్తోంది.అంతేకాకుండా, ఉద్యోగాలు మారినప్పటికీ చాలామంది ఈపీఎఫ్ ప్రయోజనాలను కొనసాగించేందుకే మొగ్గు చూపుతున్నారు. జులైలో సుమారు 16.43 లక్షల మంది పాత సభ్యులు తమ ఉద్యోగాలు మారి తిరిగి ఈపీఎఫ్ఓ సంస్థల పరిధిలోకి వచ్చారు. తమ పీఎఫ్ ఖాతాలను ముగించుకోకుండా, కొత్త కంపెనీకి బదిలీ చేసుకోవడం ద్వారా వారు తమ దీర్ఘకాలిక ఆర్థిక భద్రతను కాపాడుకుంటున్నారు. గతేడాదితో పోలిస్తే ఇలా తిరిగి చేరిన వారి సంఖ్య 12.12 శాతం పెరిగింది. శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం కూడా పెరుగుతోంది. జులై నెలలో కొత్తగా 2.80 లక్షల మంది మహిళలు ఈపీఎఫ్ఓలో చేరగా, నికరంగా 4.42 లక్షల మంది మహిళా చందాదారులు పెరిగారు. ఇది మరింత సమ్మిళిత శ్రామిక శక్తి వైపు దేశం పయనిస్తోందనడానికి సంకేతమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రాల వారీగా చూస్తే, కొత్త చేరికల్లో మహారాష్ట్ర అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం నికర చేరికల్లో 20.47 శాతం వాటాతో ఆ రాష్ట్రం ముందుంది. కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, హర్యానా, ఢిల్లీ, తెలంగాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు కూడా గణనీయమైన సంఖ్యలో కొత్త సభ్యులను చేర్చాయి. దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం కొత్త చేరికల్లో దాదాపు 60.85 శాతం ఈ ఐదు రాష్ట్రాల నుంచే ఉండటం విశేషం.

# భారత్-పాక్ యుద్ధాన్ని నేనే ఆపాను

ప్రసంగించిన ఆయన, ఈ ఘనత తనదేనని చెబుతూనే తనకు నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంపై తన ఆవేదనను వెళ్లగక్కారు. ఐరాస ఉన్నతస్థాయి సమావేశంలో సుదీర్ఘంగా ప్రసంగించిన ట్రంప్, "నేను ఏడు యుద్ధాలను ముగించాను. అవన్నీ తీవ్రంగా కొనసాగుతున్నవే! వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్న సమయంలో నేను జోక్యం చేసుకున్నాను" అని తెలిపారు. "అందులో భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన భీకర యుద్ధం కూడా ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు.అయితే, ట్రంప్ వాదనను భారత్ ఇప్పటికే పలుమార్లు ఖండించింది. ఈ విషయంలో ట్రంప్ జోక్యం ఏమీ లేదని, ఇరు దేశాల సైనిక ఉన్నతాధికారుల మధ్య జరిగిన చర్చల ద్వారానే సమస్య పరిష్కారమైందని ప్రధాని నరేంద్ర మోదీ గతంలోనే జూన్‌లో జరిగిన ఫోన్ సంభాషణలో ట్రంప్‌కు స్పష్టం చేశారు. పాకిస్థాన్ డీజీఎంఓ మేజర్ జనరల్ కాషిఫ్ అబ్దుల్లా, భారత డీజీఎంఓ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘయ్‌కు ఫోన్ చేసి కాల్పుల విరమణకు అంగీకరించారని భారత వర్గాలు వెల్లడించాయి. ఇదే సమావేశంలో ట్రంప్ భారత్, చైనాలపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఉక్రెయిన్‌పై యుద్ధం కొనసాగించేందుకు ఈ రెండు దేశాలు రష్యాకు ఆర్థిక సహాయం అందిస్తున్నాయని విమర్శించారు. మరోవైపు, రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్న నాటో మిత్రదేశాలు, యూరోపియన్ యూనియన్‌పైనా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "రష్యా యుద్ధాన్ని ఆపేందుకు సిద్ధపడకపోతే, అమెరికా శక్తిమంతమైన సుంకాలను విధించడానికి సిద్ధంగా ఉంది. ఈ సుంకాలు ప్రభావవంతంగా ఉండాలంటే యూరప్ దేశాలు కూడా మాతో కలవాలి" అని ఆయన హెచ్చరించారు. ప్రపంచంలో శాంతిని కాపాడటంలో ఐక్యరాజ్యసమితి పూర్తిగా విఫలమైందని ట్రంప్ దుయ్యబట్టారు. "ఈ పనులన్నీ ఐరాస చేయాల్సింది, కానీ నేనే చేయాల్సి వచ్చింది. విచారకరమైన విషయం ఏంటంటే, ఈ సందర్భాల్లో ఐరాస కనీసం సాయం చేసే ప్రయత్నం కూడా చేయలేదు" అని ఆయన విమర్శించారు. తన ప్రసంగం మధ్యలో టెలిప్రాంప్టర్ ఆగిపోయినా, ట్రంప్ తన ప్రసంగాన్ని ఆపకుండా కొనసాగించడం గమనార్హం.

# తీవ్ర ఆర్థిక సంక్షోభంలో బంగ్లాదేశ్

అనేక కంపెనీల షేర్లు వాటి ముఖ విలువ కంటే తక్కువకు పడిపోయాయి. ఆసియాలోనే అత్యధిక మొండి బకాయిలు బంగ్లాదేశ్‌లోనే ఉన్నాయని ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) ఇటీవలే నివేదించడం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. బంగ్లాదేశ్ బ్యాంక్ తాజా గణాంకాల ప్రకారం, వాణిజ్య బ్యాంకుల మొండి బకాయిలు జూన్ నాటికి దాదాపు 6 లక్షల కోట్ల టాకాలుగా ఉన్నాయి. దీనికి అదనంగా, మరో 3.18 లక్షల కోట్ల టాకాల రహస్య బకాయిలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మొత్తం పంపిణీ చేసిన రుణాలలో 20.2 శాతం మొండి బకాయిలుగా మారాయి. ఇది గతేడాదితో పోలిస్తే 28 శాతం అధికం. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ బ్యాంకింగ్ వ్యవస్థ ఆసియాలోనే అత్యంత బలహీనంగా ఉందని ఏడీబీ పేర్కొంది. బలహీనమైన నియంత్రణ, రాజకీయ జోక్యం, అవినీతి ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. "రాజకీయ జోక్యం ఆగి, న్యాయవ్యవస్థను బలోపేతం చేసే వరకు ఈ సమస్య పరిష్కారం కాదు" అని సౌత్ ఏషియన్ నెట్‌వర్క్ ఆన్ ఎకనామిక్ మోడలింగ్ (శామ్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సెలమ్ రైహాన్ అన్నారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. తీవ్ర నష్టాల్లో ఉన్న ఐదు ఇస్లామిక్ బ్యాంకులను (ఫస్ట్ సెక్యూరిటీ, సోషల్ ఇస్లామీ, గ్లోబల్ ఇస్లామీ, యూనియన్, ఎగ్జిమ్ బ్యాంక్) కలిపి "యునైటెడ్ ఇస్లామీ బ్యాంక్" అనే కొత్త ప్రభుత్వ రంగ బ్యాంకుగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ బ్యాంకుల మొండి బకాయిలు 48 నుంచి 98 శాతం వరకు ఉన్నాయి. వీటిని ఆదుకునేందుకు ప్రభుత్వం కనీసం 20,000 కోట్ల టాకాలను మూలధనంగా అందించనుంది. మరోవైపు, ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిస్థితి కూడా దయనీయంగా ఉంది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో, టాప్ 20 ఎగవేతదారుల నుంచి కేవలం 219 కోట్ల టాకాలను మాత్రమే రికవరీ చేయగలిగారు.బ్యాంకింగ్ రంగ సంక్షోభం ప్రభావం నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సంస్థలపై మరింత తీవ్రంగా ఉంది. 20 సంస్థల మొండి బకాయిలు 21,462 కోట్ల టాకాలుగా ఉన్నాయి, ఇది వాటి మొత్తం రుణాల్లో 83 శాతం. వీటిలో తొమ్మిదింటిని మూసివేయాలని సెంట్రల్ బ్యాంక్ సిఫార్సు చేసింది. డిపాజిటర్లకు డబ్బు తిరిగి చెల్లించలేని స్థితిలో అనేక సంస్థలు ఉండటంతో ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది. స్టాక్ మార్కెట్ కూడా దాదాపు 38 శాతం క్షీణించింది. ఢాకా స్టాక్ ఎక్స్ఛేంజ్ (డీఎస్ఈ) ప్రకారం, లిస్ట్ అయిన 397 కంపెనీలలో 98 కంపెనీల షేర్లు వాటి ముఖ విలువ కంటే తక్కువ ధరకు ట్రేడ్ అవుతున్నాయి. బలహీనమైన కంపెనీలను మార్కెట్ నుంచి తొలగించి, బలమైన వాటిని ప్రోత్సహించాలని డీఎస్ఈ బ్రోకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సైఫుల్ ఇస్లాం అభిప్రాయపడ్డారు.

# పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు లభిస్తుంది

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు హామీ ఇచ్చారు. ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి ఆధ్వర్యంలో మాజీ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని ఆయన బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా రెపరెపలాడించాలని సూచించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన దొంగ హామీలను గడపగడపకూ వివరించాలని హరీశ్ రావు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను గ్రామాల్లో గడపగడపకూ వివరించాలని హరీశ్ రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు ఎంతలా ఇబ్బంది పడుతున్నారో ప్రజలకు వివరించాలని సూచించారు.

# పేదరికంపై తెలంగాణ విజయం

ఆర్థిక వృద్ధి నేరుగా ప్రజల జీవితాలపై చూపిస్తున్న ప్రభావాన్ని స్పష్టం చేస్తోందని అధికారులు చెబుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం ఇటీవల తన ప్రసంగంలో నియో-మిడిల్ క్లాస్ వర్గాన్ని వారికి జీఎస్టీ రేట్ల తగ్గింపుల ద్వారా కలిగిన ప్రయోజనాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఐక్యరాజ్యసమితి లక్ష్యాల ప్రకారం రోజుకు 1.25 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవించేవారిని తీవ్ర పేదలుగా పరిగణిస్తారు. 2030 నాటికి తీవ్ర పేదరికాన్ని నిర్మూలించాలన్న ఐక్యరాజ్యసమితి లక్ష్యానికి తెలంగాణ సాధించిన ఈ విజయం ఎంతో ముఖ్యమైనది. వాతావరణ మార్పులు, ఆర్థిక సంక్షోభాలు, సామాజిక సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని ప్రజల్లో పెంచడం కూడా ఈ లక్ష్యాలలో ఒక భాగం.నీతి ఆయోగ్ ఎస్‌డీజీ సూచీ రాష్ట్రాల పనితీరును అంచనా వేస్తుంది.

ఈ సూచీలో ఆరోగ్య బీమా లేదా ప్రభుత్వ పథకాల ద్వారా ఆరోగ్య సేవలు పొందుతున్న కుటుంబాల సంఖ్య వంటి సూచికలను పరిగణనలోకి తీసుకుంటారు. తెలంగాణలో 69 శాతం పైగా కుటుంబాలు ఆరోగ్య బీమా పరిధిలో ఉన్నాయని తాజా నివేదికలు చెబుతున్నాయి. ఇది గత కొన్నేళ్లలో పోలిస్తే గణనీయమైన పురోగతిని సాధించింది.

2020-21లో తెలంగాణ 68 పాయింట్లతో 14వ స్థానంలో ఉండగా 2019-20లో కేవలం 52 పాయింట్లతో అదే 14వ స్థానంలో నిలిచింది. కానీ ఐదేళ్లలో దేశంలోనే రెండో స్థానానికి చేరుకోవటం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో సాధించిన విజయానికి నిదర్శనంగా నిలిచాయి.

# మేడారంలో రాతి కట్టడాలు

సీఎం రాతి కట్టడాలు కూడా వందల ఏళ్లు నిలబడి ఉంటాయని అన్నారు.

### - రామప్ప ఆలయం స్ఫూర్తిగా

పాలంపేటలోని రామప్ప ఆలయం స్ఫూర్తిగా మేడారంలో కూడా రాతి కట్టడాలు నిర్మించాలని నిర్ణయించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాతి కట్టడమైతేనే సమ్మక్క- సారలమ్మల కీర్తి మరో వెయ్యేళ్లు కూడా కనిపిస్తుందని అన్నారు. మాల వేసుకున్నంత అకుంఠిత దీక్ష వందరోజుల్లోనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కుంభమేళాకు వేల కోట్లు ఇచ్చే కేంద్రప్రభుత్వం మేడారం జాతరకు ఎందుకు ఇవ్వట్లేదు? అని బహిరంగ సభలో ప్రశ్నించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆలయాలు మాత్రమే కాదు సమ్మక్క-సారలమ్మ ఆలయం వైపు కూడా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని తెలిపారు. పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మలు అని గుర్తుచేశారు. ఫిబ్రవరి 6, 2023న మేడారం నుంచే తన పాదయాత్ర మొదలుపెట్టానని రేవంత్ చెప్పారు. సమ్మక్క-సారలమ్మ ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడిందని, శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

### - రాతి కట్టడాలతోనే నిర్మాణాలు

మేడారం ఆలయ అభివృద్ధిపై స్థానికుల అభిప్రాయాలు తీసుకునేందుకే ఇక్కడికి వచ్చానని, 100 రోజుల్లో పనులు మొత్తం పూర్తయ్యేలా అధికారులు చూడాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాతి కట్టడాలతోనే నిర్మాణాలు ఉండేలా డిజైన్లు రూపొందించామని, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నిర్మాణాలకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. జంపన్నవాగులో నీరు నిల్వ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని, రాబోయే వందరోజులు నిష్ఠతో పనులు పూర్తి చేయాలని అన్నారు. మేడారం ఆలయ అభివృద్ధిపై సమీక్షించిన సీఎం గద్దెల విస్తరణ డిజైన్లను ఆవిష్కరించారు. ప్రణాళిక, డిజైన్లను పూజారులు, ఆదివాసీ సంఘాలకు అధికారులు వివరించారు.

### - బంగారం సమర్పించిన సీఎం

అంతకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనదేవతలైన సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీఎం అమ్మవార్లకు 68 కిలోల నిలువెత్తు బంగారం సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పర్యటనలో సీఎంతో పాటు మంత్రులు సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### - గద్దెల విస్తరణ, మార్పుల సూచనలు

మేడారం ఆలయ అభివృద్ధి పనులపై అధికారులు, పూజారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. గద్దెల విస్తరణ, దేవస్థాన అభివృద్ధి ప్రణాళికలపై పూజారులతో రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, పూజారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. మార్పుల డిజైన్, గద్దెల విస్తరణకు తుది సూచనలు చేశారు. చర్చల అనంతరం అభివృద్ధి పనుల డిజిటల్ ప్లాన్‌ను సీఎం విడుదల చేశారు. సమీక్ష అనంతరం అక్కడే జరిగిన బహిరంగసభలో పాల్గొని ప్రసంగించారు. మహా జాతర నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది.

# కోర్టులు రికవరీ ఏజెంట్లు కాదు

దుర్వినియోగం చేసేలా ఉందని వ్యాఖ్యానించింది. అంతేకాదు, ఇలాంటి చర్యలు న్యాయ వ్యవస్థకు తీవ్ర ముప్పు అని పేర్కొంది. "బకాయిలు వసూళ్లకు న్యాయస్థానాలేమీ రికవరీ ఏజెంట్లు కావు, న్యాయవ్యవస్థ దుర్వినియోగానికి ఏమాత్రం అనుమతించబోం" అని ధర్మాసనం తేల్చిచెప్పింది. అరెస్టులకు ముందు అవి క్రిమినల్ కేసులా? సివిల్ వివాదాలా? అని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించింది.

ఇటువంటి కేసులు పోలీసుల్ని క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టేస్తాయని ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ అన్నారు. కొన్ని సందర్భాల్లో గందరగోళం ఉంటుందని, సివిల్ వివాదాల్లో క్రిమినల్ చట్టాలు దుర్వినియోగం కాకుండా నిరోధించేందుకు తెలివిగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. కాగా, ఈ విషయంలో పోలీసుల పరిస్థితిని కోర్టు అర్థం చేసుకుంటుందని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఒకవేళ శిక్షార్హమైన నేరం జరిగినట్లు ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోతే 2013లో లలితా కుమారి కేసులో సుప్రీంకోర్టు తీర్పును పోలీసులు పాటించలేదని విమర్శలు ఎదుర్కోవలసి వస్తుందని న్యాయమూర్తులు చెప్పారు. ప్రతి జిల్లాకు ఒక నోడల్ ఆఫీసర్‌గా సాధ్యమైనంతవరకు రిటైర్డ్ జిల్లా జడ్జి నియమించాలని న్యాయమూర్తులు పేర్కొన్నారు. నోడల్ అధికారిని పోలీసులు సంప్రదించి, అది సివిల్ కేసా? లేక క్రిమినల్ కేసా? అనేది తెలుసుకుని ఆ తర్వాత చట్ట ప్రకారం ముందుకు వెళ్లొచ్చని కోర్టు అభిప్రాయపడింది. దీనిపై రెండు వారాల్లోగా వివరాలను సమర్పించాలని సొలిసిటర్ జనరల్‌ను ఆదేశించింది.

# కులగణన సర్వే బయటపెట్టకుండానే బీసీ రిజర్వేషన్లు

కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆమె ఆరోపించారు.

### - చిత్తశుద్ధి ఉంటే ఆ పని చేయండి

స్థానిక సంస్థల ఎన్నికల తేదీలు ప్రకటించే లోపే కులగణన సర్వే వివరాలు వెల్లడించి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. హడావిడిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి రాజకీయ ప్రయోజనం పొందడానికి ప్రయత్నిస్తే బీసీలకు అన్యాయం చేసినట్టే అని వ్యాఖ్యానించారు. గ్రామపంచాయతీల వారీగా కుల గణన వివరాలు వెల్లడించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం తెలంగాణ జాగృతి మొదటి నుంచి చిత్తశుద్ధితో పని చేస్తుందని, రిజర్వేషన్ల పెంపు సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం కొన్ని నెలల కిందటే కులగణన సర్వే వివరాలు వెల్లడించింది. ఏ కులం, మతానికి చెందిన వారు తెలంగాణలో ఎంత మంది ఉన్నారో లెక్కలు అసెంబ్లీ వేదికగా సైతం తెలిపింది. అయితే కుల గణన సర్వేను రాష్ట్ర ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటుందని మాజీ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. కులగణన సర్వే వివరాలు బయటపెట్టకుండా బీసీ రిజర్వేషన్లు ఖరారు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వ కుట్ర చేస్తోందని సంచలన ఆరోపణలు చేశారు.

### - బీసీల రిజర్వేషన్ల కోసం కవిత పోరాటం

కొన్ని రోజుల కిందట బీసీల రిజర్వేషన్లు పెంపు కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత దీక్ష చేశారు. తరచుగా బీసీ సంఘాల నేతలను కలిశారు. అన్ని పార్టీల నేతలను కలిసి బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం మద్దతు తెలపాలని కోరారు. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు వివరాలు సమర్పించాలని ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు గ్రామ సర్పంచ్ ఎన్నిలకు సంబంధించి ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల వివరాలు సమర్పించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశించింది. సంబంధిత అధికారులు రూపొందించిన జాబితా, వివరాలను ఎన్నికల కమిషన్‌కు సమర్పించారు.

### - పూర్తి కావొస్తున్న హైకోర్టు ఇచ్చిన డెడ్ లైన్

జులై నెలలో హైకోర్టు సెప్టెంబర్ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి డెడ్ లైన్ ఇవ్వడం తెలిసిందే. మరో వారం రోజుల్లో సెప్టెంబర్ పూర్తి కావొస్తుంది. బీసీ రిజర్వేషన్లను తన రాజకీయ అంశంగా తీసుకుని పోరాటం చేస్తున్న కవిత తాజాగా తెలంగాణ ప్రభుత్వంపై కుట్ర ఆరోపణలు చేశారు.

కులగణన సర్వే వివరాలు పూర్తిగా ప్రజలతో పంచుకోవాలని, గ్రామపంచాయతీల వారీగా కులగణన వివరాలను బహిర్గతం చేసి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ప్రభుత్వం హడావుడిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని కవిత అభిప్రాయపడ్డారు. బీసీల రిజర్వేషన్లు పెంపు కోసం తెలంగాణ జాగృతి పోరాటం ఆపదని కవిత స్పష్టం చేశారు.

# 23 గ్రామాల్లో ఎన్నికలపై స్టే

హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, నిజాం ఆర్డర్ ఆధారంగా గిరిజన గ్రామాలుగా పరిగణించాలని తీర్పు ఇచ్చింది. రాష్ట్రపతి ఉత్తర్వులను పక్కనపెట్టి నిజాం ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవడంపై స్థానికులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పరిగణించవద్దని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు.

1950లో రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వుల్లో మంగపేట మండలంలో 23 గ్రామాలు లేవని గిరిజనేతరుల తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో స్టే ఇవ్వాలని కోరారు. దీంతో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. మంగపేట మండల పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికల పైనా స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కావాలనేది మనందరి ఆకాంక్ష

తీసుకుంటున్నట్లు వివరించారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ రూ.2.5 లక్షల ఆరోగ్యబీమాను కల్పిస్తున్నట్లు చంద్రబాబు వివరించారు. మనిషి సగటు వయసు 120 సంవత్సరాలని చెప్పిన చంద్రబాబు అయితే 120 ఏళ్లకు తినాల్సిన ఆహారాన్ని 40 ఏళ్లకే తినేస్తున్నామని అన్నారు. ఆహారమే ఔషధం వంటశాలే ఫార్మసీ అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ, తాను అనారోగ్య కారణాలతో ఏ రోజు కూడా సెలవు తీసుకోలేదని చంద్రబాబు గుర్తుచేశారు. అవసరమైన దానికంటే అధికంగా తినడం వలనే అనారోగ్యాలు వస్తున్నాయన్న చంద్రబాబు ప్రతి ఒక్కరూ తమ జీవన విధానం మార్చుకోవాలని సూచించారు. వంట నూనె, ఉప్పు, పంచదార వాడకం తగ్గించాలని.. 8 గంటలపాటు ప్రశాంతంగా నిద్రపోవాలని సూచించారు.ఈ క్రమంలోనే ఎమ్మెల్యేలకు కూడా చంద్రబాబు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యేలు ప్రాక్టీస్ చేయాలని పోషకాహారం మితంగా తీసుకోవాలని సూచించారు. ఎప్పుడూ ఆనందంగా ఉండేందుకు ప్రయత్నించాలని బతికినంత కాలం సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలనేదే తన కోరికని చెప్పుకొచ్చారు. ప్రతి రోజూ ఉదయం ఎన్ని పనులు ఉన్నా సరే కనీసం 45 నిమిషాలు యోగా లేదా వ్యాయామం చేయాలని సూచించారు.

### - సిజేరియన్లపై చంద్రబాబు ఆందోళన

మరోవైపు రాష్ట్రంలో 90 శాతం సిజేరియన్ ఆపరేషన్లు ప్రైవేటు ఆసుపత్రులలోనే జరుగుతున్నాయని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని ఏమాత్రం ఆమోదించబోమని స్పష్టం చేశారు. సిజేరియన్ ఆపరేషన్లను ఎలా నియంత్రించాలనే దానిపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. 2026 నాటికి ఏపీ జనాభా 5.37 కోట్లకు చేరుకుంటుందన్న చంద్రబాబు, దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తర ప్రదేశ్, బిహార్ రాష్ట్రాల వలనే మనదేశంలో జనాభా బ్యాలెన్స్ అవుతోందని చంద్రబాబు చెప్పుకొచ్చారు.

# ఢిల్లీలో వేడుకగా జాతీయ అవార్డుల ప్రదానోత్సవం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారతీయ సినీ రంగంలో అత్యంత విశిష్టంగా భావించే 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అట్టహాసంగా జరిగింది. 2023 సంవత్సరానికి గాను భారతీయ సినిమాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ ఏడాది ఉత్తమ నటుడి పురస్కారాన్ని బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్, విలక్షణ నటుడు విక్రాంత్ మస్సే సంయుక్తంగా గెలుచుకున్నారు. పాన్-ఇండియా చిత్రం 'జవాన్'లో అద్భుత నటనకు షారుఖ్ ఖాన్‌కు, '12త్ ఫెయిల్' చిత్రంలో అసాధారణ నటనకు విక్రాంత్ మస్సేకు రజత కమలం లభించింది. విశేషమేమిటంటే, వీరిద్దరికీ ఇదే తొలి జాతీయ అవార్డు కావడం గమనార్హం. మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ కెరీర్‌లో షారుఖ్ ఖాన్ జాతీయ అవార్డు అందుకోవడం ఇదే మొదటిసారి. భారతదేశంలో 'కింగ్ ఆఫ్ బాలీవుడ్'గా పేరుగాంచిన షారుఖ్, 80కి పైగా చిత్రాలలో నటించి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆయన ఇప్పటికే పద్మశ్రీ, ఫ్రాన్స్‌కు చెందిన చెవాలియర్ డి లా లెజియన్ డి'హొన్నూర్ వంటి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. ఇక విక్రాంత్ మస్సే సైతం టీవీ రంగం నుంచి వచ్చి 'ఏ డెత్ ఇన్ ది గంజ్', 'ఛపాక్', 'మీర్జాపూర్' వంటి వెబ్ సిరీస్‌లతో తన నటనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ వేడుకలో భారతీయ సినిమాకు చేసిన సేవలకు గాను, మలయాళ సినీ దిగ్గజం మోహన్‌లాల్‌కు దేశంలోనే అత్యున్నత సినీ పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. దాదాపు ఐదు దశాబ్దాలుగా మలయాళ చిత్ర పరిశ్రమలో తన అద్భుత నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న మోహన్‌లాల్‌ను కేరళలో అభిమానులు 'లాలెట్టన్' అని ఆప్యాయంగా పిలుచుకుంటారు. ఆయన 350కి పైగా చిత్రాలలో నటించి, ఐదు జాతీయ అవార్డులతో పాటు ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. ఆయన కెరీర్‌లో 'రాజావింటే మకన్', 'కిరీడం', 'భారతం', 'వానప్రస్థం' వంటి ఎన్నో క్లాసిక్ చిత్రాలు ఉన్నాయి. ఈ కార్యక్రమానికి కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఫీచర్ ఫిల్మ్ కేటగిరీ జ్యూరీ చైర్మన్, ప్రముఖ దర్శక-నిర్మాత అశుతోష్ గోవారికర్, రచయిత గోపాలకృష్ణ పాయ్, దర్శకుడు పి. శేషాద్రి వంటి ప్రముఖులు హాజరయ్యారు. 2023 సంవత్సరానికి సంబంధించిన ఈ అవార్డులను ఆగస్టు 1, 2025న కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే.

# హైకోర్టుకు ఐఏఎస్ స్మితా సబర్వాల్

తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

### - స్మితా సబర్వాల్‌పై చర్యలకు సిఫారసు చేసిన కాళేశ్వరం కమిషన్

"కాళేశ్వరం నిర్మాణాలపై రివ్యూ చేసిన కమిషన్, నా సందర్శనలు, ఫోటోలు, జిల్లా ఫీడ్‌బ్యాక్‌లను రిపోర్టులో పొందుపరిచింది. కానీ, నాకు 8(బి) మరియు 8(సి) నోటీసులు ఇవ్వకుండా చర్యలు సిఫార్సు చేయడం చట్టవిరుద్ధం" అని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ మంగళవారం దాఖలైంది. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ హయాంలో నిర్మించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రాజెక్టులో అక్రమాలు, లోపాలు ఉన్నాయని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి పీసీ ఘోష్ అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ రిపోర్టును అగస్టు 2025లో అసెంబ్లీలో టేబుల్ చేశారు.

### - తన వాదనలు వినకుండా చర్యలకు సిఫారసు చేశారన్న స్మితా సబర్వాల్

ముఖ్యమంత్రి కార్యాలయంలో స్పెషల్ సెక్రటరీగా తొమ్మిదేళ్లు పనిచేసిన స్మితా, కాళేశ్వరం పై అడ్మినిస్ట్రేటివ్ అనుమతులు జారీలో కీలక పాత్ర పోషించారని కమిషన్ తెలిపింది. మేడిగడ్డ, సుందిళ్లు, అన్నారంను పలు సందర్భాల్లో సందర్శించిన ఫోటోలు తీసుకుని రిపోర్టులో పొందుపరిచారు. జిల్లా అధికారుల ఫీడ్‌బ్యాక్‌లను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెరవేసేవారని తెలిపారు. నిజాలను క్యాబినెట్ ముందు పెట్టకుండా, అక్రమాలకు అవకాశం ఇచ్చినందుకు స్మితా సబర్వాల్ పై చర్యలు తీసుకోవాలి" అని కమిషన్ సిఫార్సు చేసింది. మొత్తం 19 అధికారులపై చర్యలు సిఫార్సు చేసింది.

### - కాళేశ్వరం అనుతమలు చట్టపరంగానే జారీ

"అబ్యూస్ ఆఫ్ ప్రాసెస్"గా, తనపై చర్యలు సిఫార్సు చేయడానికి 8(బి) చర్యలు తీసుకోవాలని సూచించే నోటీసు, 8(సి) విచారణకు అవకాశం నోటీసులు ఇవ్వలేదని స్మితా సబర్వాల్ నోటీసుల్లో పేర్కొన్నారు. తన సందర్శనలు, ఫీడ్‌బ్యాక్‌లు "సెలెక్టివ్"గా రిపోర్టులో పొందుపరిచారని కాళేశ్వరం అనుమతులు "చట్టపరంగా" జారీ అయ్యాయన్నారు. తనపై రాజకీయ కారణాలతోనే చర్యలు తీసుకోవాలనుకుంటున్నారని వాదించారు. రిపోర్టును క్వాష్ చేయాలని కోరారు.

### - ఇంకా దర్యాప్తు ప్రారంభించని సీబీఐ

కమిషన్ రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన తర్వాత తర్వాత, తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం పై సీబీఐ ఇన్వెస్టిగేషన్ కు సిఫారసు చేసింది. అయితే సీబీఐ ఇంకా విచారణ చేపట్టలేదు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు

రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులపై జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. విశాఖ ఉక్కుపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చినప్పటికీ, ప్రతిపక్ష వైసీపీ ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారాలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. వాస్తవాలను తెలుసుకోకుండా విమర్శలు చేయడం ప్రతిపక్షానికి అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి అనేక పెద్ద పరిశ్రమలను తీసుకువచ్చినట్లు లోకేశ్ గుర్తుచేశారు. ముఖ్యంగా, అనంతపురం జిల్లాకు కియా మోటార్స్ పరిశ్రమను తీసుకురావడం ద్వారా ఆ ప్రాంత రూపురేఖలే మారిపోయాయని తెలిపారు. "కియా రాకముందు అనంతపురం జిల్లాలో ప్రజల తలసరి ఆదాయం రూ.70 వేల కంటే తక్కువగా ఉండేది. ఆ పరిశ్రమ, దాని అనుబంధ యూనిట్ల రాకతో అక్కడి యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి, తలసరి ఆదాయం గణనీయంగా వృద్ధి చెందింది" అని ఆయన వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఇలాంటి పెట్టుబడులు ఎంతో కీలకమని పేర్కొన్నారు.

### -మండలిలో తీవ్ర వాగ్వాదం

ఇదే చర్చ సందర్భంగా, మహిళల గౌరవం అనే అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రతిపక్ష నేతలు మహిళల గౌరవం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని లోకేశ్ విమర్శించారు. "నిండు సభలో నా తల్లిని దారుణంగా అవమానించినప్పుడు ఈ నేతలకు మహిళల గౌరవం గుర్తుకు రాలేదా? ఆ అవమానంతో ఆమె కోలుకోవడానికి రెండు నెలలు పట్టింది. ఆ బాధ ఏంటో నాకు తెలుసు. మా పార్టీ మహిళలపై అక్రమ కేసులు పెట్టినప్పుడు వీరు ఏం చేశారు? మహిళలను అవమానించే వైసీపీ నేతలకు వారి గౌరవం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు" అని లోకేశ్ తీవ్ర స్వరంతో అన్నారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి, ఉపాధి కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, విశాఖ ఉక్కు వంటి రాష్ట్ర ఆస్తులను కాపాడటంలో వెనకడుగు వేసేది లేదని ఆయన స్పష్టం చేశారు.

# తెలంగాణలో బతుకమ్మ చుట్టూ రాజకీయాలు

## – తల్లిని దూరం చేస్తున్నదెవరు.?



**హైదరాబాద్** తెలంగాణవ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఎంగిలి బతుకమ్మతో ప్రారంభమైన వేడుకలు తొమ్మిది రోజులపాటు తెంగాణ వ్యాప్తంగా ,గ్రామగ్రామాన తీరొక్కపూలతో, భక్తిశ్రద్దల నడుమ జరుపుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది బతుకమ్మ వేడుకలను తెలంగాణలో ప్రధాన రాజకీయ పార్టీలు భుజానెత్తుకున్నాయి. అధికార కాంగ్రెస్, బీఆర్ ఎస్, బిజేపీకి తోడు ఈఏడాది వేరుకుంపటి పెట్టిన తెలంగాణ జాగృతి వరకూ ఇలా వివిధ రాజకీ పార్టీలు బతుకమ్మ వేడుకలను తమ ఖాతాలో వేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ నేపధ్యంలో బతుకమ్మ చీరలు, పాటలు ఒకటేమిటి, ఏం చేసినా బతుకమ్మపై భక్తిని మరచి,పొలిటికల్ టార్గెట్ గా మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.తెలంగాణలో ఈ ఏడాది బతుకమ్మ పట్టణాలకు మాత్రమే పరిమితం కాదు, రాష్ట్రపండుగా మొత్తం రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో అత్యంత వైభవంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నాం. ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సజ్జల బతుకమ్మ వరకూ భక్తి శ్రద్దలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేసామంటోంది అధికార కాంగ్రెస్ ప్రభుత్వం. ఈనెల 26వ తేది వరకూ తెలంగాణలోని అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాలలో బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 27వ తేది నుంచి 30వ తేదీ వరకూ హైదరాబాద్‌లో బతుకమ్మ వేడుకులను కనివినీ ఎరుగని స్థాయిలో నిర్వహిస్తున్నామంటోంది కాంగ్రెస్ ప్రభుత్వం. 28వ తేదిన లాల్ బహుదూర్ స్టేడియంలో 63 అడుగుల బతుకమ్మను ఏర్పాటు చేసి గన్నీస్ బుక్ రికార్డును సొంతం చేసుకోబోతున్నామని చెబుతున్నారు. ఇక్కడివరకూ అంతా బాగానే ఉంది కానీ, బతుకమ్మ వేడుకల్లో పంచే చీరలకు ఇందిరమ్మచీరగా పేరు మార్చడంపై పొలిటికల్ దుమారం రేగుతోంది. బతుకమ్మ చీరలకు ఇందిరమ్మ పేర్లేంటని రాజకీయ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బతుకమ్మ పేరు లేదా తెలంగాణ మహిళల పేర్లు పెట్టాలికానీ ,ఇలా ఇందిరమ్మపేర్లు పెట్టడం వల్ల తెలంగాణ తల్లికి బతుకమ్మను దూరం చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ ఎస్ సైతం బతుకమ్మ వేడుకలను వైభవంగా జరిపేందుకు కేడర్ ను సన్నద్ధం చేసింది. ఇప్పటికే బిఆర్ఎస్ మహిళా నేతలు ఆయా జిల్లాలలో బతుకమ్మ సంబురాలను నిర్వహిస్తున్నారు. కానీ బిఆర్ఎస్ నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలలో సైతం పొలిటికల్ అజెండా బలంగానే వినిపిస్తోంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పాటను బిఆర్ ఎస్ పార్టీ అవహేళన చేస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ పాలనపై ఉయ్యాల.. ఉయ్యాలో బతుకమ్మ అంటూ పాటను ప్రచారం చేయడం, అదే పాటతో బతుకమ్మ ఆడటంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ విమర్శలు చేయాలంటే బతుకమ్మ పాటలను వాడుకోవడమేంటని ఆగ్రహం వ్యక్తమవుతోంది.బిజెపి మహిళా మోర్చఆద్వర్యంలో ఈ ఏడాది బతుకమ్మ వేడుకలు గతంలో ఎన్నడూ విధంగా వినూత్నంగా నిర్వహించడంతోపాటు, సాధ్యమైనంత ఎక్కువ మంది మహిళలతో మండల స్థాయిలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నారు. బిఆర్ఎస్ నుంచి విడిపోయి వేరుకుంపటి పెట్టిన కవిత సైతం బతుకమ్మ వేడుకుల్లో తనకున్న బ్రాండ్ ఇమేజ్ ఏ మాత్రం తగ్గకుండా దూసుకుపోతున్నారు.

జాగృతి అనుబంధ సంస్దల ఆధ్వర్యంలో ఇప్పటికే తన తండ్రి సొంత గ్రామం చింతమడక నుంచి బతుకమ్మ వేడుకులను ప్రారంభించిన కవిత తొమ్మిదిరోజులపాటు తెలంగాణవ్యాప్తంగా వివిధ జిల్లాలలో బతుకమ్మ సంబురాలలో పాల్గొంటూ జాగృతి మార్క్ కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.ఇలా ఒక్కో పార్టీ ఒక్కో తీరుగా తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ వేడుకులను కేవలం పొలిటికల్ అజెండాతో నిర్వహిస్తూ , తెలంగాణ తల్లికి బతుకమ్మను దూరం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కల్మషంలేని తీరొక్కపూలతో జరిగే వేడుకులకు ఈ రాజకీయ రంగులేంటనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

### కోవర్ట్‌ఆపరేషన్తో మావోయిస్ట్

## అగ్రనేతల ఎన్కౌంటర్లు

**హైదరాబాద్** మావోయిస్టు నేతల ఎన్ కౌంటర్లు పోలీసులు కోవర్ట్ ఆపరేషన్లతో జరిపారని వార్తలు గుప్పుమన్నాయి. నాలుగు నెలలక్రితం కోవర్ట్ ఆపరేషన్తో నంబాల ఎన్కౌంటర్ అయింది. కేశవరావు ఎన్కౌంటర్ నుంచి కోవర్ట్ ఆపరేషన్ మొదలయ్యాయి. తన వ్యూహంలో భాగంగా నంబాల తన దగ్గర పనిచేసే ఐదుగురిని ఛత్తీస్గఢ్ పోలీస్ డీఆర్జీ లో చేర్పించినట్లు సమాచారం. ఆ తరువాత కొద్దిరోజులకే నంబాల దగ్గర పనిచేసే ఇద్దరు మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయినవారు ఇచ్చిన సమాచారంతో కోవర్ట్ ఆపరేషన్ ప్రారంభించారు.నంబాల ప్లాన్ను కనిపెట్టిన ఛత్తీస్గఢ్ ప్రభుత్వం, కౌంటర్ ప్లాన్ వేసింది. పోలీసుల ముసుగులో ఉన్న మావోయిస్టులను డీఆర్జీ కనిపెట్టింది. తరువాత నంబాల కదిలికలు కనిపెట్టి ఎన్కౌంటర్ చేసారు. కోవర్ట్ ఆపరేషన్తోనే సత్యనారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి ఎన్కౌంటర్ అయ్యాయని సమాచారం.

## దుర్గమ్మను దర్శించుకున్న హోంమంత్రి అనిత

**విజయవాడ** హోంమంత్రి అనిత మంగళవారం నాడు దుర్గమ్మను దర్శించుకున్నారు. మంత్రి మాట్లాడుతూ దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. సుపరిపాలన అందిస్తున్న సీఎం చంద్రబాబు, పవన్, లోకేష్ కు శక్తి, మంచి ఆరోగ్యం ఇవ్వాలని దుర్గమ్మను కోరుకున్నా. మా కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తోంది.. మరో 20 ఏళ్లపాటు కూటమి ప్రభుత్వం ఉండాలని ప్రార్థించా. ఏపీపై సైకోల కళ్లు పడకూడదని దుర్గమ్మను వేడుకున్నానని అన్నారు.

## నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ప్రణాళికలు

### – గొట్టిపాటి రవి కుమార్, విద్యుత్ శాఖ మంత్రి

**అమరావతి** విద్యుత్ ఉపకేంద్రాల పై శాసనమండలి లో ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర యాదవ్, పేరా బత్తుల రాజశేఖర్, బీటీ నాయుడు అడిగిన ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమాధానం ఇచ్చారు.(రాష్ట్రంలో 6% నుంచి 8% కి విద్యుత్ వినియోగం పెరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ట్రాన్స్ కో పరిధిలో 375 సబ్ స్టేషన్లు అందుబాటులో ఉన్నాయి. గృహ, వ్యాపార, పారిశ్రామిక భవిష్యత్తు అవసరాలను తీర్చేందుకు మౌలిక వసతుల కల్పన జరుగుతోందని అన్నారు.రూ. 5,500 కోట్లతో 68 నిర్మాణ పనులు శర వేగంగా జరుగుతున్నాయి . లో వోల్టేజ్ సమస్యలను అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 14 సబ్ స్టేషన్ల నిర్మిస్తున్నాం. ఈ ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయితే రాష్ట్రంలో లో ఓల్టేజ్ సమస్యలు అనేవి ఉండవు . భవిష్యత్తు అవసరాలను ముందుగా గుర్తించే నిర్మాణాలు చేపడుతున్నాం. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ, ఇండస్ట్రియల్ పాలసీలతో పెట్టుబడులు ముందుకొస్తున్నాయి. పరిశ్రమలకు అనుగుణంగా నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ప్రణాళికలు వేస్తున్నాం. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత 63 సబ్ స్టేషన్లను మంజూరు చేశామని అన్నారు.

## ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

**బద్వేలు** ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త నిరసనలో భాగంగా బద్వేల్ నియోజకవర్గం కలసపాడులో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఓటర్ల జాబితా విషయంలో అవకతవకలు సృష్టించి అనేక దొంగ ఓట్లను నమోదు చేసి ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడుస్తుందని, దీనిపైన కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడుతుందని ఈ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు, ఈరోజు కలసపాడులో సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని ఆమె అన్నారు. జిల్లావ్యాప్తంగా లక్ష సంతకాల సేకరణ చేసి ఓట్ చోరీకి వ్యతిరేకంగా ప్రతి పౌరుడికి తన ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యం తీసుకువచ్చి, ప్రతి ఓటర్ యొక్క గళాన్ని ఎన్నికల సంఘానికి తెలిసే విధంగా ఈ సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ సభ్యులు డాక్టర్ అన్వర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న రామిరెడ్డి , కలసపాడు మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, బి. కోడూరు మండల అధ్యక్షుడు గుర్రప్ప, కాశినాయన మండలం అధ్యక్షుడు పుల్లూరు ఖాజావలి, కాంగ్రెస్ నాయకులు భాష, కిషోర్, ముజాహిద్ ,సాల్మన్ , నాయబ్ రసూల్, బాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆయుర్వేద వైద్య సేవలు వినియోగించుకోవాలి

**కరీంనగర్** ప్రభుత్వ ఆయుర్వేద వైద్య సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా కరీంనగర్ రామ్ నగర్ లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో ఉచిత ఆయుర్వేద మెడికల్ క్యాంపు నిర్వహించారు. రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రదర్శనలో ఉంచిన ఆయుర్వేద ఔషధాలను, పలు రకాల ఆయుర్వేద మొక్కలను పరిశీలించారు. ఇక్కడ యోగా కేంద్రంలో యోగాసనాలను పరిశీలించారు. ఆయుష్మాన్ ఆసుపత్రిని సందర్శించి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో ఆరోగ్య మహిళ సహా ప్రభుత్వం నుంచి లభించే ఉచిత వైద్య సేవలు, ఔషధాల వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. ఆయుష్ డిపార్ట్మెంట్ నుండి అందజేస్తున్న సేవలను వివరంగా రోగులకు తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గర్భిణీలకు సాధారణ ప్రసవానికి మేలు చేసే యోగాసనాలను గురించి తెలియజేయాలన్నారు. ఆస్పత్రి ఆవరణను సుభ్రం చేసి మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, యునాని సీనియర్ మెడికల్ ఆఫీసర్ యసబ్ సుల్తానా, డి.పి.ఎం జి.ప్రవీణ్ కుమార్, ఆర్.నీరజ పాల్గొన్నారు.హైపటైటిస్ వ్యాక్సినేషన్ పరిశీలన వైద్య విధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న హైపటైటిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు.

## సీఎం సహాయ నిధి.. పేద కుటుంబాలకు అండ..

### – ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**జయశంకర్ భూపాలపల్లి** )సీఎం సహాయ నిధి.. పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం చిట్యాల మండల కేంద్రంలోని రైతు వేదికలో చిట్యాల మరియు టేకుమట్ల మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 80 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్దిదారులకు రూ.25,70,000/- విలువైన చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు.

చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు, ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేద, నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అన్నారు. మానవతాదృకృథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికీ ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పరామర్శ..ఈరోజు టేకుమట్ల మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన సాధ ఓదెలు(డిష్ ఆపరేటర్) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చిట్యాల ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించారు. ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

### బన్సీలాల్ పేట శ్మశాన వాటిక

## స్థలం కుర్మ సంఘానిదే

### – ఎమ్మెల్యే తలసాని

**సికింద్రాబాద్** బన్సీలాల్ పేట్ లోని ఆ స్థలం కుర్మ సంఘానికి చెందిన స్మశాన వాటిక స్థలమేనని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. తమ స్మశానవాటిక స్థలంలో అక్రమంగా అనుమతులు తీసుకొని బహులంతస్తుల భవనం నిర్మాణము చేస్తున్నారని కుర్మసంఘం నాయకులు వివిధ రకాలుగా నిరసనలు చేస్తున్నారు.

రెండు రోజుల క్రితం వీరికి అండగా మార్వాడీలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆందోళన కారులు సైతం వీరికి అండగా నిలవడం, వారితో కలిసి పెద్దఎత్తున ధర్నా చేశారు. ఈ నేపద్యంలో ఈ రోజు తలసాని శ్రీనివాస్ యాదవ్ రెవిన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్థలం కచ్చితంగా కుర్మ సంఘవారికి చెందిన స్మశాన వాటిక అని తెలిపారు. ఈ స్థలం తమ స్వాదినంలోకి తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. కోర్టులో వివాదం ముగిసిన వెంటనే స్మశాన వాటికకు కావలసిన సౌకర్యాలన్ని కల్పించి అప్పగిస్తానని వెల్లడించారు. తన పేరును దుర్వినియోగం చేసి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని కబ్జాదారులను హెచ్చరించారు.

## ప్రజలకు ఇబ్బంది లేకుండా బ్యాంక్ సేవలు అందించాలి

**విజయవాడ** విజయవాడ నోవాటెల్ హోటల్లో లోక్ సభ సభార్డినేట్ లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్ వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ బ్యాంకుల ఉన్నతాధికారులు హజరయ్యారు.

బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రజల సమస్యల పరిష్కారం, రుణాల మంజూరు ప్రక్రియలో పారదర్శకత, చిన్న వ్యాపారులు, రైతులకు సులభ రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్ ప్రోత్సాహం, బ్యాంకింగ్ రిఫార్మ్స్ అమలు పై చర్చ జరిగింది. ప్రజలకు చేరువైన ఆర్థిక సేవలు అందించే మార్గదర్శకాలు రూపొందించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా బ్యాంక్ సేవలు అందించాలని, ఆర్థిక అభివృద్ధిలో బ్యాంకుల పాత్ర కీలకమని, సామాజిక బాధ్యతలలో బ్యాంకులు ముందుండాలని ఎంపీ కేశినేని శివనాథ్ సూచించారు. .

### ఖమ్మం నగరంలోని వైఎస్సార్ కాలనీలో

## అర్ధరాత్రి దొంగల బీభత్సం

### అర్ధరాత్రి 6 ఇళ్లలో చోరీలకు పాల్పడిన దొంగలు

**ఖమ్మం** ఖమ్మం నగరంలోని వైఎస్సార్ కాలనీలో అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. అర్ధరాత్రి 6 ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు.

విలువైన బంగారు ఆభరాలు,వెండి,నగదు ఎత్తుకెళ్లారు. దసరా పండుగకు సొంత గ్రామాలకు వెళ్లిన ఇళ్లను ఎంచుకొని తాళాలు పగులగొట్టి చోరికి పాల్పడ్డారు. ఎనిమిది మంది దొంగల ముఠా ఒంటిపై దుప్పట్లు కప్పుకొని వచ్చినట్లుగా బాధితులు చెబుతున్నారు. వరస దొంగతనాలతో ఖమ్మం పట్టణ ప్రజలు బెంబెలెత్తుతున్నారు. చివరకి కానిస్టేబుల్ ఇంటిని కుడా దొంగలు వదలలేదు. సీసీ కెమెరాలు ఉన్న ఇంట్లో, మనుషులు ఉన్నా పట్టించుకోకుండా దొంగలు హల్ చల్ చేసారు.

### రెండో రోజుకు చేరుకున్న

## దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

**విజయవాడ** ఇంద్రకీలాద్రిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. దుర్గమ్మ గాయత్రి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. కుంకుమ పూజకు వచ్చే భక్తులకు దేవస్థానం అధికారులు ఇవ్వకపోవడంతో గందరగోళం ఏర్పడింది. పోలీసులు ఓంకారం వద్ద భక్తులను క్యూ లైన్ లో పంపిస్తున్నారు. అధికారుల మధ్య సమన్వయం కొరవడింది.

### పరారీ ఖైదీ కోసం

## మూడు ప్రత్యేక పోలీసు బృందాలు

**విజయవాడ** పోలీసు ఎస్కార్ట్ నుంచి తప్పించుకుని పారిపోయిన నిందితుడు బత్తుల ప్రభాకర్ ఆచూకీ కోసం మూడు ప్రత్యేక బృందాలను నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఏర్పాటు చేసారు. సోమవారం నాడు ఎస్కార్ట్ విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించి రిమాండ్ నిందితుడు తప్పించుకోవడానికి కారణం అయిన ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లను పోలీసు కమిషనర్ సస్పెండ్ చేసారు. నిందితుడిని ముద్దాయిని పట్టుకోవడానికి ఏ.ఆర్.ఏ.డి.సి.పి. కుంబా కోటేశ్వర రావు ది నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసారు. సదరు ప్రత్యేక బృంధాలను చుట్టుపక్కల జిల్లాలు అయిన కృష్ణా, తూర్పు గోదావరి, ఏలూరు, పశ్చిమ గోదావరి బృందాలతో సమన్వయం చేసుకుంటూ ఎట్టి పరిస్థితులలో నిందితుడిని పట్టుకోవాలని పోలీసు కమిషనర్ ఆదేశాలు జారీచేశారు.

## ఈ యేడాది దుర్గమ్మ భక్తులకు తప్పని తిప్పలు

**విజయవాడ**దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ ఆంక్షలతో అసౌకర్యం కలుగుతోందని భక్తుల ఆవేదన. సాధారణ ట్రాఫిక్ ఉన్నా అసాధారణ ఆంక్షలు విధించారు. కంట్రోల్ రూమ్ ఫ్లైఓవర్ వైపు నుంచి ద్విచక్ర వాహనాలను సైతం పోలీసులు నిలిపి వేస్తున్నారు. మరో వైపు కుమ్మరిపాలెం నుంచి సైతం ద్విచక్ర వాహనాల రాకపోకలనే నియంత్రిస్తున్నారు. దాంతో అమ్మవారి దర్శనాల పైనా ఆంక్షల ప్రభావం పడింది.

### ప్రకృతిని పూజించే సంస్కృతి బతుకమ్మ

## పండుగకు తంగేడు పూల కొరత....

**– తంగెడు పూలపై పుల్కం ప్రశాంత్ స్నేహ బృందం తీసిన వీడియో వైరల్**

**చొప్పదండి** బతుకమ్మ పండుగ సందర్భంగా తంగేడు పూల కొరతపై కరీంనగర్ జిల్లా గంగాధర మండలం చెర్లపల్లి (ఆర్)కి చెందిన పుల్కం ప్రశాంత్ అనే యువకుడు తన స్నేహ బృందం అసునూరి ప్రవీణ్ ,జింక శ్రావణ్,జగిత్యాలకి చెందిన దైవాల కిషోర్ అనే యువకులు రూపొందించిన వీడియో సామాజిక మాధ్యామాల్లో వైరల్ గా మారింది. ఒకప్పుడు బతుకమ్మ పండుగంటే సంచులు పట్టుకుని తంగెడు పూలు,గునుక పూలు పలు ప్రకృతి ప్రసాదించిన రకరకాల పువ్వులు తీసుకుని రావడానికి యువకులు,మహిళలు, ఆడపడుచులు పోయేవారు. గతంలో ఊరి పొలిమేరల్లో కావాల్సినంత తంగేడు పూలు, మక్క పెరడులలో,సేనులలో కావాల్సినంత గునుగు పూలు పూసేది. పట్టుకుచ్చులు వాకిట్ల, పెరట్లలల్ల విరగబూసేది, ఊరి పొలిమేరలు రియల్ ఎస్టేట్ తో ప్లాట్లుగా మారిపోయినాయి. పెరట్లల్లో కొట్టే గడ్డిమందుకు గునుగు పువ్వు సచ్చిపోయింది, గత సంవత్సరం 100 రూపాయలు ఖర్చు చేసిన పిరికెడు తంగేడు పూలు దొరకలేదు. మహిళలు సాంప్రదాయ బద్దంగా భక్తి శ్రద్ధలతో రోజు ఆడే బతుకమ్మ ఆటలకు, చివరిరోజు జరుపుకునే బతుకమ్మ పండుగకు బతుకమ్మ పేర్చాడానికి పువ్వు లేకుండా చేసుకున్న కాలం మనదని 9 వ రోజు బతుకమ్మ వచ్చేసరికి గునుగు, తంగేడు కోసం మనం పడుతున్న కష్టాలని దృష్టిలో ఉంచుకుని మన పెరట్లో పూసిన పువ్వు తెంపుకోవాల్సిన మనం , డబ్బులు పెట్టి కొనుక్కునే రోజులకి వచ్చాం అని,దీంతో మార్కెట్లో ఈ పూల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని పకృతిని కాపాడుకోవాలని కనువిప్పు కలిగించేందుకు స్మగ్లర్ లు వజ్రాలు, బంగారం ఎలా తీసుకోని ఎవరికంట పడకుండా ఇతరులకు ఇచ్చి వ్యాపారం ఎలా చేస్తారో బాలీవుడ్ సినిమా మాదిరిగా ఈ వీడియో తీయడం జరిగిందని నిర్వాహకుడు పుల్కం ప్రశాంత్ పలువురు ఇందులో నటించిన యువకులు తెలిపారు. ఇన్ స్టాగ్రామ్,ఫేస్ బుక్ లో,సోషల్ మీడియా లో, యూ ట్యూబ్ లో ఈ వీడియో గత 4 రోజులుగా చక్కర్లు కొడుతూ ప్రేక్షకులని ఆకట్టుకుంటు చైతన్యాన్ని కలిగిస్తుందని తెలిపారు.

## బీజేపీ ఎస్టీ మోర్చా ర్యాలీ

**నాచారం** బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా రవి నాయక్ బాధ్యతలు స్వీకరిస్తున్న నేపధ్యంలో నాచారం నుండి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు రవి నాయక్ బీజేపీ నేతలు భారీ ర్యాలీగా బయలు దేరి వెళ్లారు. నాచారం హనుమాన్ దేవాలయం లో పూజలు నిర్వహించిన అనంతరం బారి ర్యాలీగా బయలు దేరారు. ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన రామచంద్రరావు కు, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్-ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్ రెడ్డి లతో పాటు, బిజెపి రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ లో 18 సంవత్సరాలు గా పని చేస్తున్న నా సేవలను గుర్తించి గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గిరిజనుల అభివృద్ధి కి ఎల్లపుడు కృషి చేస్తానని, గిరిజనలకు ఎలాంటి అన్యాయం జరిగిన ముందుండి పోరాడతానని రవి నాయక్ హామీ ఇచ్చారు...

### అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన

## కంటోన్మెంట్ అధికారులు

**సికింద్రాబాద్** రక్షణ శాఖ భూములలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని కంటోన్మెంట్ అధికారులు నేలమట్టం చేసారు. పికెట్ ఎరుకల బస్తీలో నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేసారు. గతంలోనే అక్రమ భవన నిర్మాణానికి నోటీసులు జారీ చేసినట్లు కంటోన్మెంట్ అధికారులు చెబుతున్నారు. పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. మేము 90 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని భవన యజమాని కుటుంబం అంటోంది. మాకు కోర్టుకు పోయే సమయం కూడా ఇవ్వకుండా కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 50ఇళ్లు ఎరుకల సామాజిక వర్గం వారు నివాసం ఏర్పరచుకొని ఉంటున్నట్లు బాధితులు చెబుతున్నారు. కావాలని కక్ష్యపురితంగా తమ ఇంటిని కూల్చివేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

## బౌద్ధనగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**సికింద్రాబాద్** బతుకమ్మ సంబరాలు బౌద్ధ నగర్ డివిజన్ అశోక్ నగర్ లో బౌద్ద నగర్ డివిజన్ బీజేపీ నేత మేకల కీర్తిహర్షకిరణ్ ఆధ్వర్యం లో ఘనంగా జరిగాయి. పెద్దఎత్తున మహిళలు పాల్గొన్న ఈ వేడుకలకు ముఖ్యఅతిధిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య కిషన్ రెడ్డి పాల్గొని వారితో కలిసి బతుకమ్మ ఆటలో కదం కలిపారు. ఆటపాటలతో అలరించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తి శ్రద్ధ లతో సంబరాలలో మునిగి తేలారు. చిన్న పెద్ద తేడా లేకుండా వర్షంలోనే బస్తీ వాసులంతా ఉత్సాహంగా పాల్గొనడమే కాకుండా మరుపురాని పండుగగా తమ సెల్ ఫోన్ లతో చిత్రీకరించుకొని భద్రపరచుకున్నారు. ఈ సందర్భంగా కావ్య కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంబరాలను ఏర్పాటు చేసిన మేకల కీర్తి హర్షకిరణ్ అభినందించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికే చాటిచెప్పే గొప్ప పండుగ మన బతుకమ్మ పండుగ అని తెలిపారు.

### అమ్మవారి దర్శనానికి వచ్చిన దివ్యాంగులకు, వృద్ధులకు

## "సేవాదళ్" బృందం చేయూత

**ఇంద్రకీలాద్రి:** దుర్గ అమ్మవారి దర్శనానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులకు పోలీసు సేవాదళ్ బృందాలు చక్కటి సేవలందిస్తున్నాయి. పదిమంది సభ్యులతో ఏర్పాటు చేసిన ఈ బృందాలు వేకువ జాము నుంచి రాత్రి దర్శనం పూర్తయ్యే వరకు దివ్యాంగులు, వృద్ధులు దర్శనం చేసుకోవడంలో సాయం చేస్తూ భక్తుల ప్రశంసలు పొందుతున్నాయి. నవరాత్రులలో రెండవ రోజైన మంగళవారం గాయత్రీ దేవి రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారిని సేవించుకోవడానికి సత్తుపల్లి నుంచి ఎం. రజని అనే దివ్యాంగురాలు తన భర్త కృష్ణయ్యతో కలసి విజయవాడకు వచ్చారు. వృద్ధుల కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సులో ఇంద్రకీలాద్రి పైకి చేరుకోగా, అక్కడి నుంచి చక్రాల కుర్చీలో సేవాదళ్ సభ్యులు ఆమెను దర్శనానికి తీసుకువెళ్లారు. పోలీస్ ఏఆర్ విభాగానికి చెందిన ముగ్గురు మహిళా సేవాదళ్ సభ్యులు తనకు ఏ ఇబ్బంది కలగకుండా చూసుకున్నారని, వారికి, పోలీస్ శాఖకు, దేవస్థానానికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని కృష్ణయ్య-రజనీ దంపతులు చెప్పారు.

## హరితహారం చెట్లు నరికేసిన వారిపై

# చర్యలు తీసుకోవాలి

**- మందాపురం నరేష్**

**పురపాలక సంఘం కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన నరేష్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) హరితహారం చెట్లును నరికి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మందాపురం నరేష్ మంగళవారం పురపాలక కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మందాపురం నరేష్ మాట్లాడుతూ మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్ లో హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన చెట్లను కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కొట్టేసి డబ్బులకు అమ్ముకున్నట్లు తెలిపారు. గతంలో ఈ చెట్లను హరితహారం కార్యక్రమం భాగంగా నాటినట్లు గుర్తు చేశారు. పురపాలక, అటవీశాఖ అధికారుల అనుమతులు లేకుండా ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ స్థలాలలో నాటిన చెట్లను ఏ విధంగా కొట్టేసి అమ్ముకుంటారని ప్రశ్నించారు. అక్రమంగా హరితహారం చెట్లను నరికివేసి అమ్ముకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పురపాలక కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అక్రమంగా చెట్లు నరికేసిన వ్యక్తుల పైన వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఐ (ఎం) పార్టీ మండల నాయకులు రమేష్, పూజ తదితరులు పాల్గొన్నారు.

## రాజన్నాలయం విస్తరణ కారణంగా

## ఈఓ కార్యాలయం తాత్కాలిక మార్పు

**- విస్తరణ పనులు పూర్తయ్యేంత వరకు**

**భీమేశ్వర సదన్ లోనే ఈఓ కార్యాలయ సేవలు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన ప్రధాన ఆలయ విస్తరణ పనుల కారణంగా, ఈఓ (ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) కార్యాలయం తాత్కాలికంగా భీమేశ్వర సదన్‌కు మంగళవారం తరలించబడింది. ఇంజనీరింగ్, గణాంక, పరిపాలన, లీజులు, ఇతర విభాగాల కార్యాలయాలు కూడా అదే క్రమంలో భీమేశ్వర సదన్‌లోని కొత్త వర్క్ స్పేస్‌లో కొనసాగుతాయని,ఆలయ విస్తరణ పూర్తయ్యే వరకు ఈ మార్పు కొనసాగుతుందని,తద్వారా ఆలయ పరిపాలన సజావుగా జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఈఓ రమాదేవి భీమేశ్వర సదనంలో నూతన తాత్కాలిక కార్యాలయంలో కొలువుదీరారు.

## పాఠశాలకు అదనపు టీచర్ ను

## కేటాయించాలని ఎంఈఓకు వినతిపత్రం



మేడ్చల్( ప్రశ్న న్యూస్) మండల పరిధిలోని అక్బర్జాపేట్ గ్రామ ప్రాథమిక పాఠశాలకు అదనపు టీచర్ ను కేటాయించాలని కోరుతూ డీవైఎఫ్ఐ గ్రామ అధ్యక్షుడు రాము మంగళవారం మండల విద్యాశాఖ అధికారి శంకరయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ అక్బర్జాపేట్ ప్రాథమిక పాఠశాలలో చాలా సంవత్సరాలుగా సింగిల్ టీచర్ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఒకే టీచర్ ఉండటం వల్ల 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉన్న అన్ని తరగతుల పాఠాలు హెడ్ మాస్టర్ బాధ్యతలు చేపడుతున్నారన్నారు. దీంతో విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. సదరు టీచర్ ప్రభుత్వ అధికారిక మీటింగులు ఉన్నప్పుడు పాఠశాల మూతపడుతుందని పేర్కొన్నారు. ఈ కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపేందుకు వెనకాడుతున్నారన్నారు. దీనివల్ల గ్రామంలోని పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించడానికి అదనంగా మరి ఉపాధ్యాయుని నియమించాలని కోరారు. తక్షణమే విద్యావాలంటరీనైనా నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు కోటగిరి నర్సింగరావు, వీరేష్, నర్సింహ చారి తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చెరువు మైసమ్మ ఆలయంలో

## ప్రత్యేక పూజలు చేసిన ఎర్ర విజయ్ రావు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ పట్టణంలోని పెద్ద చెరువు మీద ఉన్న కట్ట మైసమ్మ ఆలయంలో మంగళవారం ఐఎన్టీయూసీ మేడ్చల్ ఆటో యూనియన్ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షులు ఎర్ర విజయ్ రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాల్లో భాగంగా తమ ఆటోలకి అమ్మవారి ఆలయం దగ్గర పూజలు నిర్వహిస్తామని తెలిపారు. అమ్మవారి కృపా కటక్షలతో ప్రజలందరూ బాగుండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు గణేష్, ఓం రాజ్, నర్సింగ్, కిషోర్, కుమార్, సురేష్ ముదిరాజ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డులో పరిశ్రమ వ్యర్థాలను

# పారబోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**- గొంగళ్ల ప్రభాకర్ రెడ్డి**








మేడ్చల్( ప్రశ్న న్యూస్) మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని పూడూరు గ్రామంలో గల డంపింగ్ యార్డులో ప్రైవేటు కంపెనీకి చెందిన వ్యర్థాలు పోస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుడు గొంగళ్ల ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ గోసాయిగూడలోని ఓ పరిశ్రమకు చెందిన పారిశ్రామిక వ్యర్థాలను కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు గ్రామంలోని ప్రభుత్వ డంపింగ్ యార్డులో వాహనాల ద్వారా తరలిస్తూ యదేచ్ఛగా పారబోస్తున్నారని తెలియజేశారు. ప్రైవేట్ కంపెనీ యజమానులతో ముందస్తుగా మాట్లాడుకుని ట్రిప్పుకి రూ. 3 వేల నుంచి రూ. 4 వేల వరకు వసూలు చేస్తున్నారని అన్నారు. పురపాలక సంఘం అధికారుల దృష్టికి తీసుకెళ్లిన చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గత కొన్ని సంవత్సరాలుగా యథేచ్ఛగా ప్రైవేట్ పరిశ్రమలకు చెందిన వ్యర్థాలు పారబోస్తున్న వ్యక్తులపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా పురపాలక సంఘం ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రైవేట్ పరిశ్రమల వ్యర్థాలు డంపింగ్ యార్డులో పారబోస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# దసరా సెలవుల్లో పిల్లలు జాగ్రత్త

- **చెరువులు, కుంటల వద్దకు వెళితే జాగ్రత్తలు పాటించాలి**
- **తల్లిదండ్రులూ విద్యార్థులు లను కనిపెడుతూ ఉండాలి**
- **పిల్లలకు వాహనాలు ఇస్తే వాహనల యజమానులపై చర్యలు తీసుకుంటాం**
- **శంకర్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, మేడ్చల్**
- **సెలవులు సంతోషంగా గడపాలి : శంకర్, మండల విద్యాశాఖ అధికారి**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) దసరా సెలవులంటే పిల్లలకు ఎంతో ఇష్టం. సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దంలా నిలిచే బతుకమ్మ, దసరా పండుగలకు ప్రతి సంవత్సరం మాదిరిగానే ఇచ్చే సెలవులు ప్రారంభంకావడంతో వసతి గృహాల్లోని విద్యార్థులు తమ తల్లిదండ్రుల వద్ద వాలిపోయారు. ఇన్నాళ్లు పాఠ్యపుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు సెలవులు రావడంతో కాస్త పుస్తకాలను పక్కనపెట్టి తమ వారితో జాలీగా గడపతున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు అధికారులు జాగ్రత్తలు సూచిస్తున్నారు. ఇటీవల వర్షాలు భారీగా కురవడంతో చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. కాగా జలపాతాల వద్దకు వెళ్ళినప్పుడు జాగ్రత్తగా మసులుకోవాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను కనిపెట్టుకుంటూ ఉండాలని చెబుతున్నారు. మండలంలోని ఆయా పాఠశాలల్లో చదువుకునే వందలాది మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులకు వద్దకు చేరారు. దసరా సెలవుల్లో కుటుంబ సభ్యులు, బంధువులతో ఆనందంగా గడిపోతున్నామని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులకు పండుగ వాతావరణం ఆవరించింది.

### చెరువులు, కుంటలు పట్ల పిల్లలు జాగ్రత్త :

ఈసారి భారీగా కురిసిన వర్షాలతో కుంటలు, చెరువులు అన్ని నిండుకుండలా మారాయి. కుంటలు, చెరువుల వద్దకు వెళితే కుటుంబ సభ్యులతో వెళ్లి, తగు జాగ్రత్తలు తీసుకుని క్షేమంగా ఇంటికి చేరుకోవాలని ఇటు పోలీస్, అటు విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు.






**సెలవులు సంతోషంగా గడపాలి : శంకర్, మండల విద్యాశాఖ అధికారి**



దసరా సెలవులను సంతోషంగా గడుపుతూ చదువుకు తగిన సమయం కేటాయించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి శంకర్ సూచించారు. కనీసం రోజుకు రెండు గంటల పాటు ఆయా సబ్జెక్టులలో గల అంశాల పునరావృత్తికి కేటాయిస్తే పరీక్షలకు సులభతరంగా సిద్ధం కావచ్చున్నారు. ఎక్కువసేపు మొబైల్ వీడియో గేమ్స్ లో గడపకుండా సృజనాత్మక పనులపై దృష్టి పెట్టాలన్నారు. స్వచ్ఛత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలని సూచించారు. సెలవుల్లోనూ విద్యార్థులకు చదువుపై దిశా నిర్దేశం చేయాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించినట్టు వెల్లడించారు.

### పిల్లలకు వాహనాలు ఇస్తే వాహనల యజమానులపై చర్యలు తీసుకుంటాం :

శంకర్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, మేడ్చల్ దసరా సెలవుల్లో ఇంటి వద్ద ఉండే విద్యార్థులు, చిన్నారులు తమ సైకిళ్లతో రోడ్లపైకి రాకుండా ఓపెన్ గ్రౌండ్ ప్రాంగణాలలో నడిపించుకోవాలి. చిన్నపిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇస్తే అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలు పోయే అవకాశముంది. కాబట్టి లైసెన్స్ లేని చిన్న పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇస్తే పట్టుబడిన వాహనల యజమానులపై చర్యలు తీసుకుంటాం. ఇంటి పెద్దలు ఇంట్లో లేకుంటే వాహనాల తాళాలు పిల్లలకి దొరకకుండా చూసుకోవాలి. దీంతోపాటు వారి స్నేహితులతో బయటకు వెళ్తే ఎక్కడికి వెళ్తున్నారో కచ్చితంగా తెలుసుకున్నాకే బయటకు పంపాలి. వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాల వద్దకు వెళితే అర్త్ వచ్చి విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది కాబట్టి విద్యుత్ స్తంభాల వద్దకు పంపకండి. దీంతోపాటు నవరాత్రుల్లో ఏర్పాటు చేసే అమ్మవారి విగ్రహాల వద్ద మాలదారులు 24 గంటలు అందుబాటులో ఉండడంతో పాటు అమ్మవారి మండపాలలో చిన్న పిల్లలు పడుకోకుండా చూసుకోవాలి.

# జీఎస్టీ సవరణతో అమెరికాకు చెక్

జీఎస్టీ శ్లాబుల్లో మార్పులతో కోట్ల మంది భారతీయుల రోజువారీ ఆర్థిక భారం కొంత తగ్గనుంది.నిత్యావసరాలైన పాలు, బ్రెడ్ వంటి వాటితోపాటు జీవిత బీమా, ఆరోగ్య బీమా, ప్రాణాధార ఔషధాలు లాంటి వాటిపై పన్నును పూర్తిగా తొలగించారు.చిన్న కార్లు, టెలివిజన్లు, ఎయిర్ కండిషనర్ల మీద పన్ను 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గుతుంది. ఇతర సాధారణ వస్తువులైన హెయిర్ ఆయిల్, సబ్బు, షాంపూ వంటి వాటిపై 12 లేదా 18 శాతానికి బదులుగా 5 శాతం పన్ను మాత్రమే ఉంటుంది.వస్తు సేవల పన్నుల శ్లాబుల్లో మార్పులు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల ప్రారంభంలో ప్రకటించారు.దీని వల్ల పన్నుల విధానం సరళీకృతంగా మారుతుందని...ఇంటి ఖర్చులు తగ్గుతాయని భావిస్తున్నారు.విజయ దశమి పండుగ సందర్భంగా ప్రజలు కొత్త కార్లు, దుస్తులు కొనుగోలు చేస్తారు. ఇలాంటి సమయంలో జీఎస్టీ రేట్లు తగ్గించడం పండగ సీజన్‌లో కొత్త వస్తువుల కొనుగోలుకు ఉత్సాహాన్ని ఇస్తుందని భావిస్తున్నారు.పన్ను తగ్గింపు వల్ల వినియోగ వస్తువులైన ప్యాకేజ్డ్ ఫుడ్, దుస్తుల అమ్మకాలు ఈ నాలుగు నెలల్లో పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.అమెరికా విధించిన 50శాతం సుంకాల ప్రభావాన్ని జీఎస్టీ సవరణ తగ్గించవచ్చు.ప్రజలకు డబ్బు మిగలడం వల్ల కొనుగోలు శక్తి పెరిగి ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని ప్రభుత్వం భావిస్తోంది.ఈ ఏడాది బడ్జెట్‌లో ఆదాయపు పన్ను శ్లాబులను మార్చడం ద్వారా రాయితీలు, రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించడం, తాజాగా అమల్లోకి వచ్చిన జీఎస్టీ కోతలు కొనుగోళ్లు పెరగడానికి సానుకూలంగా ఉన్నాయి.రిలయన్స్, హిందూస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్, మహీంద్రా అండ్ మహీంద్రా లాంటి సంస్థలు పన్నుల తగ్గింపు లాభాన్ని వినియోగదారులకు అందించడం ద్వారా అమ్మకాల్ని పెంచుకుంటున్నాయి.ఆగస్టులో ప్రధాని మోదీ ప్రకటన తర్వాత కార్ల తయారీ సంస్థలు ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో కార్ల కంపెనీల షేర్లు 6-17 శాతం పెరిగాయి.జీఎస్టీ సవరణల తర్వాత కార్ల గురించి అడిగే వారి సంఖ్య పెరిగిందని డీలర్లు చెబుతున్నారు.గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అమ్మకాలు 30 నుంచి 40శాతం పెరుగుతాయని భావిస్తున్నట్లు ముంబయిలోని హీరో మోటోకార్ప్ షోరూమ్ డీలర్ ఒకరు చెప్పారు."ధరలు తగ్గడంతో తొలిసారి బైక్ కొంటున్న వారి నుంచి ఎంక్వైరీలు ఎక్కువగా వస్తున్నాయి" అని హీరో మోటోకార్ప్ సంస్థ ఇండియా చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అశుతోష్ వర్మ వివరించారు.ఇప్పటి వరకు ఇలాంటి పరిస్థితి "తక్కువ ధర మోడళ్ల" విషయంలోనే ఉండేదని ఆయన అన్నారు.తాను ఈ ఏడాది 200సీసీ బైక్ కొనాలని భావిస్తున్నట్లు విశాల్ పవార్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చెప్పారు."పండుగ డిస్కౌంట్లు, పన్నుల కోత వల్ల ఏదైనా కొనడానికి ఇదే మంచి సమయం. ఈ దసరా పండగ సందర్భంగా నేను బైక్ కొంటున్నాను" అని ఆయన అన్నారు.ఇకపై తమ ఉత్పత్తుల కొనుగోళ్లు పెరుగుతాయని వినియోగ వస్తువుల తయారీ సంస్థలు కూడా ఆశాభావంతో ఉన్నాయి.పన్ను తగ్గింపుతో పాటు దేశావ్యాప్తంగా ఈ ఏడాది పంటలు బాగా పండటంతో ఎయిర్ కండీషనర్ల వంటి వస్తువుల మార్కెట్ మెట్రో నగరాలను దాటి విస్తరిస్తుందని భావిస్తున్నట్లు గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన సవ్యసాచి గుప్తా చెప్పారు.అయితే జీఎస్టీ తగ్గించడం వల్ల గోద్రెజ్ లాంటి కంపెనీలు డిమాండ్ ఏ మేరకు ఉంటుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో ధరల తగ్గింపుకు సంబంధించిన లేబుల్స్ ముద్రించడంలో బిజీగా మారాయి.మేం పాత, కొత్త ధరలను పక్క పక్కనే ముద్రిస్తున్నాం. దాని వల్ల వినియోగదారుడికి ధర ఎంత తగ్గిందో తెలుస్తుంది" అని సవ్యసాచి గుప్తా బీబీసీకి చెప్పారు.చిన్న బ్రాండ్లు, దుకాణదారులు తగ్గిన పన్నులకు అనుగుణంగా ధరల్ని సవరించే పని పూర్తి స్థాయిలో చేపట్టలేదు.వారి వద్ద తగినంత సమయం, వర్కర్లు లేకపోవడంతో తగ్గిన ధరలతో ప్యాకింగ్ చేయడం కష్టంగా మారింది.ముంబయిలోని ప్రఖ్యాత క్రాఫోర్డ్ మార్కెట్ నగరంలో అతి పెద్ద హోల్‌సేల్ రిటైల్ మార్కెట్.ఇక్కడ సుగంధ ద్రవ్యాల నుంచి గుండీల వరకు అన్నీ అమ్ముతారు.జీఎస్టీ శ్లాబుల్లో మార్పుల గురించి ఈ మార్కెట్‌లో కొద్ది మంది దుకాణదారులకు మాత్రమే అవగాహన ఉంది.అవగాహన ఉన్న వారిలోనూ అయోమయం కనిపిస్తోంది.తాను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసిన వస్తువుల ధరల్ని సవరించిన శ్లాబులకు అనుకుణంగా ఎలా మార్చాలనే దాని గురించి సరఫరాదారులతో చర్చిస్తున్నట్లు టపాసుల దుకాణం నిర్వహిస్తున్న షేక్ రెహమాన్ చెప్పారు.ఆయన దుకాణానికి పక్కనే ఉన్న బ్రైడల్ షోరూమ్‌లో నిరాశ కనిపిస్తోంది.ప్రభుత్వం రెండున్నర వేల రూపాయల కంటే తక్కువ ఉన్న దుస్తులపై జీఎస్టీ తగ్గించింది. అంత కంటే ఎక్కువ ధర ఉన్న దుస్తులపై జీఎస్టీ 18శాతంగా ఉంది.పెళ్లికి ధరించే దుస్తుల ధరలు రెండున్నర వేల రూపాయల కంటే ఎక్కువే ఉంటాయి. దీంతో నరేష్‌కు చెందిన బ్రైడల్ షోరూమ్‌లో దుస్తులు కొంటే 18శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.దీని ప్రభావం సరఫరా వ్యవస్థలతో పాటు డిజైనర్లు, చేనేత కళాకారులు, రిటైలర్లు, కస్టమర్లపై పడుతుంది."భారతీయులు పెళ్లికి ధరించే దుస్తుల మీద భారీగా ఖర్చు పెడతారు.

## పొలాల్లో తెగులు వ్యాప్తి - పంట రక్షణకు ఆవశ్యక చర్యలు తీసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి : ప్రణీత
- దుండ్రపల్లిలో వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు వ్యాప్తి
- వ్యవసాయ శాఖ హెచ్చరిక



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని దుండ్రపల్లి గ్రామంలోని వరి పంట పొలాలను మంగళవారం మండల వ్యవసాయ అధికారి ప్రణీత,వ్యవసాయ విస్తీర్ణ అధికారి లక్ష్మణ్ క్షేత్రస్థాయిలో పరిశీలించి వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు వ్యాప్తి చెందుతున్నాయని గుర్తించి, రైతులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రణీత మాట్లాడుతూవానాకాలం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటం వల్ల వరిలో తెగులు త్వరగా వ్యాప్తి చెందుతున్నాయని, ఈ తెగులు ఆకులపై పసుపు రంగు మచ్చలుగా మొదలై, చుట్టుపక్కల నీటి మచ్చల రూపంలో వ్యాప్తి చెంది, చివరికి ఎండిపోతాయి. తెగులు ఎక్కువగా ఉంటే ఎండు చారలు కలిసిపోయి పంట మొత్తం మీద వ్యాప్తి చెందుతుందన్నారు. బ్యాక్టీరియా నేల, మొక్కల అవశేషాలు, కలుపు మొక్కలలో జీవించి పంట కాలంలో పైరును దెబ్బతీస్తుంది. సాగునీటి ప్రవాహం, గాలి, వర్షం ద్వారా ఈ వ్యాధి పొలాల మధ్య వ్యాప్తి చెందుతుందన్నారు.వ్యవసాయ అధికారులు సూచించిన చర్యల్లో, తెగులు సోకిన పొలాల నుంచి సాగునీటిని మురుగు కాల్వల ద్వారా బయటకు పంపడం, యూరియా వినియోగాన్ని తగ్గించడాన్ని ముఖ్యంగా వివరించారు.

## పండుగ వేళ సీతారామ సేవ సమితి ఆపన్న హస్తం

**రెండు నెలల రేషన్ , కొత్త వస్త్రాలు అందజేత**

**దాతల సాయంతో బాధిత కుటుంబానికి ఊరట**



**దుబ్బగూడెం ఓరం కార్తీక్ కుటుంబానికి ఆసరా**

మంచిర్యాల (ప్రశ్న న్యూస్) మంచిర్యాల జిల్లా సోమగూడెం సమీపంలోని దుబ్బగూడెనికి చెందిన ముప్పై ఏళ్ల ఓరం కార్తీక్ , ఇటీవలే రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. దీంతో నడుము సంబంధిత అనారోగ్యంతో మంచం బాట పట్టగా, వైద్య ఖర్చులు తడిసి మోపెడు అయ్యాయి. బాధితుడికి చికిత్స నిమిత్తం అతడి కుటుంబం లక్షలాది రూపాయలు అప్పులు చేసింది. ఇంటికి పెద్ద దిక్కును ఎలాగైనా కాపాడుకోవాలని ఉన్నదంతా ఖర్చు పెట్టుకుని చికిత్సలు అందించారు. కార్తీక్ కి భార్య , ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న సీతారామ సేవ సమితి అధ్యక్షురాలు చంద్రకళ గోలివాడ నేతృత్వంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా దసరా పండుగ పూట కార్తీక్ కుటుంబం పూట గడవడానికి ఇబ్బందులు పడకూడదు అనే ఉద్దేశంతో వారికి రెండు నెలలకు సరిపడ బియ్యం, కిరాణా సరుకులతో పాటు కొత్త బట్టలు అందించి సేవా తత్వాన్ని చాటుకున్నారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబం సేవా సమితికి ధన్యవాదాలు తెలిపింది. కార్యక్రమానికి దాతలుగా కొనసాగిన అర్కటి రాంచందర్, సురేష్ , శాంతికి సీతారామ సేవ సమితి కృతజ్ఞతలు తెలియజేసింది. కార్యక్రమంలో కట్కూరి శాంతి, కొండలు రమాదేవి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## నల్లకుంట అమ్మవారి సేవలో విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ (ప్రశ్న న్యూస్) శ్రీ శారదా శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా హైదరాబాద్ లోని నల్లకుంట "శ్రీ శృంగేరి శంకర మఠం"లో ఉత్సవాల్లో భాగంగా మహేశ్వరీ అలంకారంలో గల శ్రీ శారదా అమ్మవారిని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ప్రభుత్వ విప్ కు వేద పండితులు వేదోక్త ఆశీర్వాదం అందజేశారు.

## రాజన్న ఆలయంలో నవరాత్రోత్సవాల రెండో రోజు ఘనంగా పూజలు

- శ్రీ రాజేశ్వరి దేవి, బ్రహ్మచారిణి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలోని శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానం లో నవరాత్రి ఉత్సవాల రెండో రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి దేవి,బ్రహ్మచారిణి దేవి అలంకారాలలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు.ఈ సందర్భంగా లక్ష్మీ గణపతి స్వామికి అధర్వశీర్ష పఠనంతో అభిషేకం,రాజరాజేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి మహాభిషేకం, అలాగే షష్టి ఉపచార

# ధైర్యం, శక్తి, తేజస్సుకు ప్రతిరూపం చంద్రఘంటా అవతారం

**(శరన్నవరాత్రుల్లో మూడవ రోజు)**



శరన్నవరాత్రుల్లో భాగంగా మూడవ రోజు అమ్మవారిని చంద్రఘంట అవతారంలో పూజిస్తారు. ఈ అవతారం కళ్యాణ కారకం. శిరస్సుపై ధరించిన చంద్రుడిని ఘంట ఆకారంలో ఆభరణంగా ధరించినట్లు ఈ తల్లి అవతారం ఉండటం వల్ల చంద్రఘంట అని పేరు వచ్చింది. ఈ తల్లి పేరును స్మరించడంతో మన మనస్సు నియంత్రణతో మరింత చురుకుదనంగా పనిచేస్తుంది తల్లిని శరణు జొచ్చినవారికి ఎల్లప్పుడు అభయఘంట మోగుతు ఉంటుంది. ఈ దేవత అందము, కరుణకు ప్రతికగా పసుపు రంగును వాడటం విశేషం.

నవరాత్రులలో పూజించే నవదుర్గల్లో మూడో అవతారమైన చంద్రఘంటా దేవి ధైర్యానికీ, శక్తికీ, తేజస్సుకు ప్రతీకగా భక్తులు భావిస్తారు. భక్తి శ్రద్ధలతో పూజించిన వారికి తన తేజస్సుతో పాపాలు, ఈతిబాధలు, రోగాలు, మానసిక రుగ్మతలు, భూత భయాలను దూరం చేస్తుంది.

శరన్నవరాత్రుల్లో భాగంగా మూడవ రోజు అమ్మవారిని చంద్రఘంట మాత అవతారంలో ఆరాధిస్తుండగా ఇదే సమయంలో విజయవాడ కనకదుర్గ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకార రూపంలో భక్తులకు దర్శనమివ్వడం విశేషం. పురాణాల ప్రకారం చంద్రఘంట మాతను పార్వతీదేవి వివాహ రూపంగా భావిస్తారు. ఈ అవతారంలో అమ్మవారు భక్తుల పాపాలను నాశనం చేసే దేవతగా ప్రసిద్ధి చెందింది. ధైర్యానికి, నిర్భయతకు చంద్రఘంట మాతను ప్రతీకగా భావిస్తారు. ఈ అమ్మవారిని చంద్రఖండ, చండిక లేదా రాంచండి అని కూడా పిలుస్తారు. శరన్నవ రాత్రుల్లో భాగంగా చంద్రఘంట మాతను పూజించే భక్తుల మనస్సులో ప్రతికూల శక్తి తొలగిపోయి సానుకూల శక్తిగా మారుస్తుందని ఇతిహాసాల్లో పేర్కొనబడింది.

### చంద్రఘంటా అవతార ప్రాముఖ్యత

పార్వతీదేవిని పెళ్లి చేసుకోవడానికి పరమేశ్వరుడు హిమాలయపర్వత దేవుడైన హిమవాన్ రాజ భవనానికి చేరుకున్నప్పుడు, పార్వతి దేవి తన తల్లి అయిన మైనాదేవి (మేనకా) పరమేశ్వరుని అసాధారణ అవతారాన్ని చూసి మూర్ఛపోతుంది. ఎందుకంటే మెడలో సర్పం, కురులన్నీ చిందరవందరగా ఉన్నాయి. పరమేశ్వరుని వెంట ఊరేగింపుగా వచ్చిన వారిలో దయ్యాలు, ఋషులు, రాక్షసులు ఉన్నారు. ఆ సమయంలో ఈశ్వరుడిని ప్రసన్నం చేసుకోవడానికి పార్వతీదేవి చంద్రఘంట రూపాన్ని ధరించింది. అప్పుడు శివుడు అందమైన యువరాజుగా కనిపించాడు. ఆ తర్వాత వారి వివాహం జరిగింది. చంద్రఘంట మాత పూజ చేసే వారు ఎరుపు, నారింజ రంగు వస్త్రాలను వాడడంతో అంగారకుడి అశుభ ప్రభావాలు తగ్గుతాయి. ఈ అమ్మవారికి ఎర్రచందనం, ఎర్రచున్ని, ఎర్రని పువ్వులు, ఎర్రని పండ్లను నైవేద్యంగా సమర్పింస్తు, దుర్గాదేవి ప్రతి రూపానికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించాలి. తల్లి చంద్రఘంట మాతకు పాలతో చేసిన తియ్యని పదార్థాలను నైవేద్యంగా సమర్పించినచో అమ్మ చల్లని చూపుతో సకల సౌఖ్యాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం



రవికుమార్ సంతోజు
బడంగ్ పేట్. రంగారెడ్డి (జిల్లా)

## గిరిజనుల అభివృద్ధికి కృషి : రవి నాయక్



నాచారం(ప్రశ్న న్యూస్) గిరిజనుల సమస్యల పరిష్కారించడంతో పాటు, గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ ఎస్టీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్ అన్నారు. ఎస్టీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాచారం నుండి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లారు. అంతకు ముందు నాచారంలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో రవి నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా బీజేపీకి తాను చేసిన సేవలను గుర్తించి బీజేపీ అధిష్టానం తనపై నమ్మకంతో ఎస్టీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడుగా అవకాశం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా తనను ఎస్టీ మోర్చా అధ్యక్షుడుగా నియమించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావుతో పాటు, మాజీ ఎమ్మెల్యేలు ఎన్ఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్ రెడ్డి లకు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవి నాయక్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, మేడ్చల్ మల్కాజ్గిరి కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్ రెడ్డి, నాచారం డివిజన్ అధ్యక్షుడు నవీన్ కుమార్, కంటెస్టెడ్ కార్పొరేటర్ అనిత పద్మారెడ్డి, ప్రకాష్, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు పైలేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిగ్మా ఆసుపత్రి పేషెంట్ చనిపోయిన ఘటనలో ఎంక్వైరీ ఎక్స్పర్ట్ ఒపీనియన్

- జిల్లా వైద్యాధికారి డా ప్రమోద్




జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన బైరి లక్ష్మణ్ అనే వ్యక్తి ఆగస్టు 23న జగిత్యాల పట్టణం గొల్లపల్లి రోడ్ లో గల సిగ్మా హాస్పిటల్లో మృతి చెందాడన్న విషయం పాఠకులకు తెలిసిందే. నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్ జి ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా వైద్యాధికారి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కన్వీనర్ డా ప్రమోద్ ఆదేశాల మేరకు జిల్లా ఉప వైద్యాధికారి డా. ఎన్ శ్రీనివాస్, మృతుడు బైరి లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో విచారణ జరిపారని తెలిపారు. బైరి లక్ష్మణ్ ఆపరేషన్ కోసం ఆసుపత్రిలో చేరగా వైద్యులు శస్త్ర చికిత్స చేస్తుండగా అతను ఆపరేషన్ థియేటర్ లో మృతి చెందాడని తెలిపారు.అయితే ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే పేషెంట్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగిన విషయం పాఠకులకు తెలిసిందే.సిగ్మా హాస్పిటల్ లో చనిపోయిన కుటుంబాన్ని 2025 ఆగస్టు 24 న ఎన్ హెచ్ ఆర్ సి బృందం పరామర్శించారు. సిగ్మా హాస్పిటల్లో పేషెంట్ చనిపోయిన ఘటన పై దర్యాప్తు జరపాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో, చనిపోయిన బైరి లక్ష్మణ్ కుటుంబానికి న్యాయం జరగాలని, అసలు సిగ్మా హాస్పిటల్లో ఏం మాయ మాఫియా జరుగుతుంది అని ట్రీట్మెంట్ చేసిన డాక్టర్ ఎవరు? పేషంటు ఎందుకు చనిపోయారు? ఈ సంఘటనపై అన్ని విధాలుగా దర్యాప్తు చేసి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో జిల్లా వైద్యాధికారి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కన్వీనర్ డా ప్రమోద్ కు పిర్యాదు చేశారని తెలిపారు.సిగ్మా హాస్పిటల్లో మృతి చెందిన ఘటనపై ఎంక్వైరీలో బైరి లక్ష్మణ్ కుటుంబ సభ్యులు హాజరయ్యారని తెలిపారు.అయితే ఈ విషయంలో ఎంక్వైరీ స్టేటస్ గురించి నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో, జిల్లా వైద్యాధికారి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కన్వీనర్ డా ప్రమోద్ కార్యాలయంకు వెళ్ళి పూర్వ పరాలు తెలుసుకున్నారని తెలిపారు. సిగ్మా ఆసుపత్రి పేషెంట్ చనిపోయిన ఘటనలో ఎంక్వైరీ కమిటీ ఎక్స్పర్ట్ ఒపీనియన్ తీసుకుంటున్నామని జిల్లా వైద్యాధికారి డా ప్రమోద్ తెలిపారు.

## డిజిటల్ అరెస్ట్ సైబర్ మోసం

- ఎస్పీ అశోక్ కుమార్
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్) డిజిటల్ అరెస్ట్ అనేది పూర్తిగా ఒక సైబర్ మోసం. దీనిని ఎవరూ నమ్మవద్దు అని డిజిటల్ అరెస్ట్ పేరిట జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని జిల్లా ఎస్పి అశోక్ కుమార్ అన్నారు. డిజిటల్ అరెస్ట్ మోసం అంటే సైబర్ నేరగాళ్లు తాము పోలీస్ అధికారులు, సీబీఐ, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ లేదా ఇతర ప్రభుత్వ విభాగాల సిబ్బంది అన్నట్లుగా నటిస్తూ, మీపై కేసు ఉందని భయపెట్టడం, వీడియో కాల్ లో అరెస్ట్ చేస్తున్నాం అని చూపించడం, డబ్బులు బదిలీ చేస్తే తప్పించుకుంటారని మోసం చేయడం వంటి నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి నేరాలను నివారించడానికి ప్రజలు కు అవగాహన తప్పనిసరి అన్నారు. డిజిటల్ అరెస్ట్ మోసానికి గురైన వెంటనే 1930 నంబర్ కి కాల్ చేస్తే డబ్బు తిరిగి రికవరీ అయ్యే అవకాశం ఉంటుంది. ఆలస్యం చేస్తే నష్టపోవాల్సిందే అని తెలిపారు.

**డిజిటల్ అరెస్ట్ మోసాల పట్ల ప్రజలకు జిల్లా పోలీసుల సూచనలు :**

1. ఎలాంటి ప్రభుత్వ శాఖలు లేదా పోలీసులు డబ్బులు అడగరు.
2. మీపై కేసులు ఉన్నాయన్న కారణంగా ఎవరైనా వీడియో కాల్ ద్వారా బెదిరిస్తే నమ్మకండి.
3. వెంటనే 1930 నెంబర్ (సైబర్ క్రైమ్ హెల్ప్లైన్) లేదా 100 నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి.
4. మోసపూరిత కాల్స్, మెసేజెస్, వాట్సాప్ వీడియో కాల్స్ కు స్పందించవద్దు.
5. ఈ రకమైన నేరాల నుండి రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ సైబర్ సేఫ్టీ పై అవగాహన పెంపొందించుకోవాలి.

## స్టేడియం ఏర్పాటుకు స్పందించిన వాలంతరి ఛైర్మెన్ వేం నరేందర్ రెడ్డి

- జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ వినతి పత్రానికి సానుకూలంగా స్పందించిన క్రీడల మంత్రి శ్రీహరి
- వివేకానంద మినీ స్టేడియంలో మధ్యలో ఇండోర్ స్టేడియంవల్ల చిన్నగా మారిన మైదానం
- జిల్లా స్థాయి క్రీడల సమయంలో ఇబ్బంది
- చల్గల్ జాతీయ రహదారిలో ఐతే క్రీడా కారులకు జిల్లా కేంద్రానికి దగ్గర గా రవాణా సౌకర్యం ఉంటుంది



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) జగిత్యాల చల్గల్ లో 10 ఎకరాలలో స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ వినతి పత్రాన్ని క్రీడల పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని వారి కార్యాలయంలో కలిసి అందజేశారని తెలిపారు.జగిత్యాల పట్టణంలో వివేకానంద మినీ స్టేడియంలో మధ్యలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయటం వల్ల మైదానం చిన్నగా మారింది అని, జిల్లా స్తాయి క్రీడల సమయంలో ఇబ్బందిగా ఉందని,జగిత్యాల జిల్లా కు ఒక మైదానం ఏర్పాటు ఆవశ్యకంగా ఉందని, జగిత్యాల నిజామాబాద్ జాతీయ రహదారి లో చల్గల్ వాలంతరి క్షేత్రం లో స్థలం ఉందని ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్ కూడా మంజూరు అయినది అని,10 ఎకరాల్లో మినీ స్టేడియం నిర్మించాలని ,జగిత్యాల రాయికల్ కోరుట్ల కథలాపూర్ ధర్మపురి ప్రాంతాల ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని, జిల్లా స్థాయి క్రీడల సమయంలో జిల్లా కేంద్రానికి దగ్గర గా ఉండడం వల్ల రవాణా సౌకర్యం కూడా ఉందని,వాలంతరి కి ఛైర్మెన్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉండగా, వారి సలహాదారు వేం నరేందర్ రెడ్డికి గతంలోనే 10 ఎకరాలలో స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది అని మంత్రి శ్రీహరికి తెలుపగా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే డా సంజయ్ తెలిపారు.

# దయచేసి ఆ వార్తలు నమ్మకండి..



బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ తెలుగు, హిందీ భాషల్లో వరుస సినిమాలతో ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నారు. ఈక్రమంలో ఆయన ఓ సినిమాలో వాల్మీకి మహర్షి పాత్రలో నటిస్తున్నట్లు ఏఐతో క్రియేట్ చేసిన పలు వీడియోలు వస్తున్నాయి. ఇక అది చూసిన అక్షయ్ కుమార్ ఫుల్ ఫైర్ అయ్యాడు. ట్విట్టర్ ద్వారా ఈ విషయంపై క్లారిటీ ఇస్తూ కీలక నోట్ రిలీజ్ చేశారు. "గత కొద్ది కాలంగా కొన్ని తప్పుడు వార్తలు ప్రచారం అవుతున్నాయి. దీనిపై నేను క్లారిటీ ఇవ్వదలుచుకున్నాను. నేను మహర్షి వాల్మీకి పాత్రలో నటిస్తున్నట్లు.. ట్రైలర్ కూడా విడుదలైనట్లు కొన్ని వీడియోలను చూశాను. అవి ఎఐని ఉపయోగించి సృష్టించబడ్డాయని నేను స్పష్టం చేయాలనుకుంటున్నాను. అవన్నీ ఫేక్ దయచేసి మీరు నమ్మకండి. దారుణమైన విషయం ఏమిటంటే.. కొన్ని వార్తా ఛానెల్‌లు ఇవి నిజమైనవా లేదా మార్ఫింగ్ చేయబడినవా అని కూడా ధృవీకరించకుండా వార్తలు రాశారు. నేటి కాలంలో, మోసపూరిత ఎఐ ద్వారా తప్పుదారి పట్టించే కంటెంట్ చాలా వేగంగా ఉత్పత్తి అవుతుంది. నిజమైన వాటికంటే అవే ఎక్కువ వేగంగా వైరల్ అవుతున్నాయి. దీనిని గమనించాలని అభ్యర్థిస్తున్నాను. ఏదైనా సమాచారాన్ని షేర్ చేసే ముందు దాన్ని పరిశీలించాలని కోరుతున్నా. వాస్తవాన్ని మాత్రమే ప్రజలకు అందించాలని మీడియా సంస్థలకు విజ్ఞప్తి చేస్తున్నాను" అని రాసుకొచ్చారు. కానీ ఆ సినిమా పేరును మాత్రం రివీల్ చేయలేదు. దీంతో ఈ పోస్ట్ చూసిన వారంతా 'రామాయణ' గురించే అని చర్చించుకుంటున్నారు.

# ఇక అందరూ సైడ్ అవ్వాల్సిందే !



ఇండస్ట్రీ లోకి చాలామంది హీరోయిన్లు వస్తున్నారు. ఇందులో కొంతమంది సక్సెస్ అవుతుంటే... మరికొంతమంది సక్సెస్ అయ్యేందుకు చాలా కష్టపడుతున్నారు.ఇక మరికొంతమంది హీరోయిన్లు... అతి తక్కువ కాలంలోనే పెద్ద సినిమాల్లో ఛాన్సులు కొట్టేస్తున్నారు. అయితే ఇలాంటి కేటగిరీలోకి హీరోయిన్ రుక్మిణి వసంత్ కూడా వస్తారు. కర్ణాటక కు చెందిన రుక్మిణి వసంత్ 2019 నుంచి ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. కన్నడ, తమిళ్, తెలుగు లో ఇప్పటికే సినిమాలు చేశారు ఈ అందాల తార. తెలుగులో అప్పుడో ఇప్పుడు ఎప్పుడో అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. జూనియర్ ఎన్టీఆర్ చేస్తున్న డ్రాగన్ సినిమాలో కూడా ఆమెకు ఛాన్స్ దక్కింది. అయితే... ఈ రుక్మిణికి కాంతార చాప్టర్ 1 లో కూడా ఛాన్స్ దక్కింది. ఈ సినిమా దసరా కానుగా రిలీజ్ కానుంది. ఇలాంటి నేపథ్యంలో కాంతార చాప్టర్ 1 మూవీ ట్రైలర్ రిలీజ్ అయింది. ఇందులో హీరో రిషబ్ శెట్టితో రొమాన్స్ కూడా చేసిన విజువల్స్ వైరల్ గా మారాయి. ముఖ్యంగా ఆమె గ్లామరస్ ఫోటోలు కూడా ట్రెండింగ్ లోకి వచ్చాయి. ఇక ఈ ఫోటోలు చూసిన సినీ ప్రియులు స్పందిస్తున్నారు. రుక్మిణి వసంత్ కూడా రష్మిక, సాయి పల్లవి లాగే మరో 10 ఏళ్లు ఇండస్ట్రీని షేక్ చేయడం గ్యారెంటీ అంటున్నారు. డ్రాగన్ సినిమా రిలీజ్ అయితే తెలుగులో నెంబర్ 1 హీరోయిన్ అయ్యే ఛాన్స్ ఉన్నట్లు చెబుతున్నారు.

# అర్జున్ దాస్ దశ తిరుగుతోంది



వయసు చిన్నదే అయినా విలనీ పండించడంలో తనదైన ముద్ర వేస్తున్న అర్జున్ దాస్ చేసింది తక్కువ సినిమాలే. అయినా సరే ప్రేక్షకుల్లో తగినంత గుర్తింపు ఉంది. ముఖ్యంగా అతని బేస్ వాయిస్ కున్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. కల్కి 2898 ఏడి కోసం ప్రత్యేకంగా వాయిస్ ఓవర్ చెప్పించారంటే తన రీచ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఓజి టీజర్ లో అలాంటోడు మళ్ళీ తిరిగి వస్తున్నాడంటే డైలాగు మారుమ్రోగిపోవడానికి కారణం కూడా ప్రత్యేకంగా అనిపించే గొంతే. ఇమ్రాన్ హష్మీతో పాటు విలన్ గా అర్జున్ దాస్ కూడా ఓజిలో ప్రతినాయకుడిగా నటిస్తున్నాడు. ఇది పెద్ద బ్రేక్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాడు.అజిత్ గుడ్ బ్యాడ్ అగ్లీలో విలన్ గా డ్యూయల్ రోల్ చేసి మెప్పించిన అర్జున్ దాస్ కు ఇప్పుడు బాలీవుడ్ అవకాశాలు తలుపు తడుతున్నాయి. రణ్వీర్ సింగ్ హీరోగా ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రూపొందబోయే డాన్ 3లో విలన్ గా అర్జున్ దాస్ నే సంప్రదించారని ముంబై టాక్. లుక్ టెస్ట్, శాంపిల్ షూట్ చేసి సరిపోతాడనుకుంటే వెంటనే అడ్వాన్స్ ఇచ్చేందుకు రెడీగా ఉన్నారట. అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్ లాంటి లెజెండరీ హీరోలు చేసిన పాత్ర కావడంతో రణ్వీర్ సింగ్ డాన్ 3 కోసం చాలా ప్రిపేర్ అవుతున్నాడు. ఇంకా ప్రారంభం కానప్పటికీ స్క్రిప్ట్ స్టేజిలోనే ఒకటికి పదిసార్లు వడబోత చేస్తున్నారు. నిజంగా అర్జున్ దాస్ కనక డాన్ 3కి ఎంపికైతే బాలీవుడ్ లో మెల్లగా జెండా పాతేయొచ్చు. అసలే అక్కడ విలన్ల కొరత తీవ్రంగా ఉంది.

అందులోనూ డాన్ ఫ్రాంచైజ్ అంటే క్రేజ్ ఖచ్చితంగా ఉంటుంది. మరి అర్జున్ దాస్ కి ఆ అదృష్టం రాసిపెట్టి ఉందో లేదో చూడాలి. తెలుగులో ఆక్సీజన్ తో ఎంట్రీ ఇచ్చిన ఇతను మళ్ళీ బుట్టబొమ్మలోనే కనిపించాడు. రెండూ పెద్దగా ఆడలేదు. తమిళ డబ్బింగులు మాస్టర్, విక్రమ్, ఖైదీ ఎక్కువ పేరు తీసుకొచ్చాయి. ఇప్పుడు ఓజి రూపంలో కనక బ్లాక్ బస్టర్ అందుకుంటే ఇక్కడా బిజీ అయిపోవచ్చు. ఆల్రెడీ పలువురు నిర్మాతలు కలిశారట కానీ ఓజి రిజల్ట్ వచ్చాకే చెబుతానని అన్నాడట.



# ఆయన నాలో ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని నింపుతున్నారు

యంగ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ 'సప్త సాగరాలు దాటి' చిత్రంతో వచ్చి ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయింది. ప్రస్తుతం ఈ అమ్మడు నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'కాంతార చాప్టర్:1'. రిషబ్ శెట్టి స్వయం దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రాన్ని హోంబలే ఫిల్మ్స్ భారీ బ్జెట్‌తో నిర్మిస్తోంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో అక్టోబర్ 2న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ క్రమంలో.. ప్రమోషన్స్ జోరు పెంచిన చిత్రబృందం వరుస అప్డేట్స్ విడుదల చేస్తున్నారు.తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ లాంచ్ చేయగా.. ఈ ఈవెంట్‌లో పాల్గొన్న రుక్మిణి ఆసక్తికర కామెంట్స్ చేసింది. "నా ఈ సినిమాలో అవకాశం ఇచ్చినందుకు మూవీ టీమ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. రిషబ్ శెట్టి మొదటి నుంచి నన్ను ప్రోత్సహిస్తున్నారు. ఆ ప్రోత్సాహంతోనే నేను ఇప్పుడు ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలోనే ఇలాంటి గొప్ప పాన్ ఇండియా మూవీలో అవకాశం అందుకున్నాను. నిజంగా ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను.

చాన్స్ ఇచ్చిన రిషబ్ శెట్టికి కృతజ్ఞతలు తెలియజేయడానికి నా దగ్గర పదాలు లేవు. ఆయన ఎప్పటికప్పుడు నాలో కొత్తదనాన్ని నింపుతూ.. నన్ను ప్రోత్సహిస్తూ ఇప్పుడు మీ ముందు యువరాణిలా నిల్చోబెడుతున్నారు. దీనికి ఆయనకు నేను రుణపడి ఉంటా. షూటింగ్ సమయంలో రిషబ్ శెట్టి నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. నా జీవితాన్ని పూర్తిగా మార్చేసిన 'కాంతార' నాకు మరో జీవితాన్ని ప్రసాదిస్తుందని భావిస్తున్నా" అని చెప్పుకొచ్చింది.

# ప్రేక్షకులను బాగా నవ్వించే సినిమా



బన్నీ వాస్ నిర్మాణ సంస్థ బీవీ వర్క్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్, వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాణంలో వస్తున్న 'మిత్ర మండలి' చిత్రంలో ప్రియదర్శి, నిహారిక ఎన్ ఎం., విష్ణు ఓఐ, రాగ్ మయూర్, ప్రసాద్ బెహారా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, సత్య, వీటీవీ గణేష్ తదితరులు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న 'మిత్ర మండలి' అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. టీజర్, కత్తందుకో జానకి, స్వేచ్ఛా స్టాండు పాటలకు లభించిన అద్భుతమైన స్పందన తర్వాత.. 'మిత్ర మండలి' చిత్ర బృందం మూడో గీతం 'జంబర్ గింబర్ లాలా'ను విడుదల చేసింది. హైదరాబాద్‌లోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా జరిగిన ఈవెంట్‌లో ఈ పాటను ఆవిష్కరించింది. లెజెండరీ కమెడియన్ బ్రహ్మానందం చిత్ర బృందంతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ.. "ఈ సినిమాలో అందరూ కుర్రోళ్లే. అందుకే వీళ్లందరితో కలిసి నటించాలనే ఉద్దేశంతో ఈ సినిమా అంగీకరించాను. నాకు అత్యంత ఆప్తుడు బన్నీ వాసు.. బ్రహ్మానందం ఈ సినిమాలో ఎలాగైనా ఉండాలని, నన్ను తీసుకొచ్చాడు. అందరూ హాయిగా నవ్వుకునే సినిమా తీయాలనే గొప్ప ఆలోచన చేసిన నిర్మాతలు కళ్యాణ్, భాను, విజయేందర్ నా అభినందనలు"అని అన్నారు. కథానాయకుడు ప్రియదర్శి మాట్లాడుతూ ఈ సినిమా చూసి థియేటర్లలో అందరూ బాగా నవ్వుతారని హామీ ఇస్తున్నానని పేర్కొన్నారు. చిత్ర సమర్పకులు బన్నీ వాసు మాట్లాడుతూ మిత్ర మండలి సినిమా ప్రేక్షకుల ముఖంపై నవ్వులు పూయించడానికే తీస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత విజయేందర్ రెడ్డి తీగల, దర్శకుడు విజయేందర్.ఎస్, సంగీత దర్శకుడు ఆర్ఆర్ ధృవన్, నాయిక నిహారిక ఎన్.ఎం, నటులు రాగ్ మయూర్, విష్ణు ఓఐ, ప్రసాద్ బెహారా తదితరులు పాల్గొన్నారు.

# ఓజీ దర్శకుడి మొదటి సినిమా కష్టాలు..




'గబ్బర్ సింగ్' సినిమా రిలీజైనపుడు ఆ సినిమా చూసి జై పవర్ స్టార్ అనుకుంటూ బయటికి వచ్చిన సగటు పవన్ కళ్యాన్ అభిమాని సుజీత్. ఈ రోజు పవన్ కెరీర్లోనే అత్యంత హైప్ తెచ్చుకున్న 'ఓజీ' సినిమాను అతను డైరెక్ట్ చేశాడు. ఈ సినిమాకు కాస్త పాజిటివ్ టాక్ వచ్చిందంటే చాలు.. రికార్డుల మోత మోగిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. కేవలం రెండు సినిమాల అనుభవంతోనే అతను పవన్‌తో పని చేసే అవకాశం దక్కించుకున్నాడు. అతడి చివరి చిత్రం 'సాహో' రేంజ్ ఏంటో తెలిసిందే. ఇంత భారీ చిత్రం చేయడానికి పునాది వేసిన మూవీ.. రన్ రాజా రన్. శర్వానంద్ హీరోగా యువి క్రియేషన్స్ నిర్మించిన ఈ చిత్రం పెద్ద హిట్టయింది.ఈ సినిమా కార్యరూపం దాల్చడం వెనుక పెద్ద స్టోరీనే ఉందంటున్నాడు సుజీత్. ఒక ఇంటర్వ్యూలో ఈ సినిమా వెనుక బ్యాక్ స్టోరీని అతను వెల్లడించాడు. ఆ సంగతులు తన మాటల్లోనే.. "అవకాశాల కోసం తిరుగుతున్న రోజుల్లో ఒక మంచి ప్రేమకథ రాసుకున్నా. ఒక ప్రొడక్షన్ హౌస్‌కు వెళ్లి కథ వినిపించా. వారికి ఫస్టాఫ్ నచ్చింది.

సెకండాఫ్ కోసం ఐదు నెలలు పని చేశా. మంచి వెర్షన్ రాసి మళ్లీ ప్రొడక్షన్ హౌస్‌ను కలిసి వినిపించా. వాళ్లు సూపర్ అన్నారు. సినిమా ఓకే అయిందన్న సంతోషంలో బైక్ మీద బయల్దేరా. నా ఫోన్ రింగయింది. పక్కన ఆపి కాల్ తీస్తే.. ఆ కథకు బడ్జెట్ ఎక్కువ అయ్యేలా ఉంది. వేరే కథ ఆలోచించమని నిర్మాత చెప్పారు. నా మైండ్ ఆగిపోయింది. అప్పుడే వర్షం మొదలైంది. రోడ్డు పక్కన కూర్చుని మూడు గంటలు ఏడ్చాను. వెన్నెల కిషోర్‌కు ఫోన్ చేస్తే తను ధైర్యం చెప్పాడు. షార్ట్ ఫిలిం గంటలో రాయగలవు. సినిమా ఒక రోజులో రాయలేవా అన్నాడు. సరే అనుకుని బండి స్టార్ చేస్తే అది కదల్లేదు. పెట్రోల్ అయిపోయింది. చేతిలో డబ్బుల్లేవు. జోరు వాన. బండిని నెట్టుకుంటూ జూబ్లీ హిల్స్ నుంచి ముషీరాబాద్ వరకు వచ్చాను. ఆ ప్రయాణంలో ఎన్నో ఆలోచనలు.

# ఆశ, అంధకారానికి మధ్య జరిగే యుద్ధం



దర్శకుడు ప్రశాంత్ వర్మ, మరో సూపర్ హీరో సినిమా 'అధీర' కోసం ఆర్.కె.డి స్టూడియోస్‌తో కలిసి పని చేయ బోతున్నారు. ఈ సినిమాతో కళ్యాణ్ దాసరి హీరోగా పరిచయం అవుతుండగా, కీలక పాత్రలో ఎస్.జే.సూర్య కనిపించనున్నారు. రివాజ్ రమేష్ దుగ్గల్ నేతృత్వంలోని ఆర్కేడీ స్టూడియోస్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా వస్తున్న ఈ చిత్రం భారతీయ ఇతిహాసాల స్ఫూర్తితో, గ్రేట్ విజువల్స్‌తో తెరకెక్కుతోంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఎస్.జే.సూర్య ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. క్రూరమైన రాక్షసుడిలా ఉన్న సూర్య ముందే కళ్యాణ్ దాసరి మోకాళ్లపై కూర్చుని ధైర్యంతో పైకి చూస్తూ మోడరన్ వార్ అవతార్‌లో ట్రూ సూపర్ హీరోలా ఈ పోస్టర్‌లో కనిపించారు. ఇది ఆశ, అంధకారం మధ్య జరిగే యుద్ధం. ధర్మాన్ని రక్షించడానికి కళ్యాణ్ దాసరి తన సూపర్ పవర్స్‌ని ఉపయోగిస్తారు. అద్భుతమైన యాక్షన్, స్టంట్స్, గ్రేట్ విజువల్స్, హై వోల్టేజ్ డ్రామాతో ఈ సినిమా థియేటర్స్‌లో థండర్‌క్లాప్ ఎక్స్‌పీరియెన్స్ అందించనుంది అని మేకర్స్ తెలిపారు.

# గంజాయి రవాణా, అమ్మకం, వినియోగంపై కఠిన చర్యలు తప్పవు

**- జిల్లా ఎస్పీ : మహేష్ బి. గీతే**

**- డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో నిషేధిత 14.945 కిలోల గంజాయి దహనం**



వేములవాడ / సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసి 45 కేసుల్లో స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ నిషేధిత 14 కిలోల 945 గ్రాముల గంజాయిని మంగళవారం జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ దహనం చేశారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ, "నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోఫిక్ సబ్ స్టాన్సెస్ యాక్ట్ (ఎన్.డి.పి.ఎస్) ప్రకారం గంజాయి రవాణా చేసినా, అమ్మినా, వినియోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లా పోలీస్ బలగం గంజాయి రవాణాను సమర్థవంతంగా నిరోధిస్తోంది. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో, విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నాం. అక్రమ గంజాయి రవాణాపై నిరంతరం నిఘా ఉంచి, నార్కోటిక్ జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాం" అని హెచ్చరించారు. జిల్లా ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ లేదా ఇతర మత్తు పదార్థాల సరఫరా జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, డీసీఆర్బీ సి.ఐ నాగేశ్వరరావు, ఆర్.ఎస్.ఐ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దుద్దిళ్ల శ్రీధర్‌కు ఎదురులేకుండా చేయడమే ప్రజాస్వామ్యమా..

**- ఏం తప్పు చేశానని ఎన్ టీవీ తనపై అసత్య ప్రచారం చేస్తోంది**

**- ప్రభుత్వం...పాలకుల మెడలు వంచేలా మీడియా పనిచేయాలి**

**- 37ఏండ్లుగా ప్రజా జీవితంలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నా**

**- 22నెలలైనా సొంతూరిలో రెండు ఇళ్లు కట్టించని ఎమ్మెల్యేపై స్టోరీలు చేయండి**

**- మీట్ ద ప్రెస్‌లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**




మంథని( ప్రశ్న న్యూస్) మంథని నియోజకవర్గంలో కొన్ని మీడియా సంస్థలు ప్రత్యేక పరిస్థితులు సృష్టిస్తు మంథని ఎమ్మెల్యేకు ఎదురులేకుండా చేయాలనే ప్రయత్నాలు చేస్తున్నాయని, ఇదేనా ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియా పాత్ర అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంథనిలో మీడియా సంస్థలు తనతో ఎన్నికల్లో పోటీ పడాలనుకుంటున్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతుందన్నారు. .దుద్దిళ్ల శ్రీధర్ ప్రోద్భలంతో కొన్ని మీడియా సంస్థలు తనకు వ్యతిరేకంగా కథనాలు ప్రచారం చేస్తున్నాయని, తాను కనబడటం లేదని ప్రజలకు మొహం చాటేస్తున్నానని కొన్ని మీడియా సంస్థలు తప్పుడు కథనాలు ప్రసారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఏం తప్పు చేశానని తనపై ఎన్‌టీవి అసత్య ప్రచారం చేస్తుందని ప్రశ్నించారు. మీడియా సంస్థలు ప్రభుత్వం, పాలకుల మెడలు వంచేలా పని చేయాలే తప్ప ఒక గరీబు బిడ్డ పైకి వస్తే ఎలా అణిచివేయాలని చూడటం కాదన్నారు. స్టోరీలు రాయాల్సి వస్తే మూడు సార్లు మంత్రిగా అయిన శ్రీధర్‌పై తయారు చేయాలని ఆయన సూచించారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా మంథనికి ఏమీ చేయని దద్దమ్మ శ్రీధర్ అని ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. మంథనిలో ఏ ఘటన జరిగినా తననే భాద్యుడిని చేసే దుర్మార్గ ప్రయత్నాలు నడుస్తున్నాయని, నిజానిజాలు తెలుసుకోకుండా మీడియా సైతం అదే దోరణిలో వెళ్లడం బాధాకరమన్నారు. నియోజకవర్గ ప్రజలు 40ఏండ్లుగా ఓట్లు వేసి అధికారం ఇస్తే ఇప్పటి వరకు ఈ ప్రాంతానికి ఒక పరిశ్రమ, ప్యాక్టరీ, ఇండస్ట్రీ తీసుకురాలేదని, ఓ పదిమందికి ఉద్యోగాలు పెట్టించలేదని ఆయన విమర్శించారు. మంథనిలో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడాన్ని సైతం తప్పు పడుతున్నారని, తమ సొంత ఖర్చులతో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకుని ఆవిష్కరణకు ఏర్పాట్లు చేసుకుంటే రాత్రికి రాత్రే దొంగల్లా వచ్చి ముసుగు తొలగించారని, అది తప్పు కాదా దానిపై ఎందుకు స్టోరీ చేయలేదని ప్రశ్నించారు. ఆనాడు శ్రీధర్ తండ్రి నక్సలైట్ల పేరిట జనాలను చంపిస్తే ఈనాడు శ్రీధర్ పోలీసులతో చంపిస్తున్నాడని అన్నారు. ఎమ్మెల్యే సొంతూరు ధన్వాడ ప్రజల ఆశీర్వాదంతో 40ఏండ్లుగా అమెరికాలో ఉంటున్న దుద్దిళ్ల కుటుంబం సొంతూరిలో స్కూల్‌కు ఒక్క బేంచీ ఇవ్వలేదని, ఇందిరమ్మ పథకంలో పైలేట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రెండు ఇండ్లు కూడా పూర్తి చేయలేదన్నారు. ఇలాంటి దానిపై కథనాలు రాయాలే తప్ప తాను ఏం చేశానని దాడి చేస్తున్నారని అన్నారు. సీబీఐ విచారణ మొదలైందని తాను జంకుతున్నానని అనడం విడ్డూరంగా ఉందని తాను ఏం తప్పు చేశానని భయపడాలని ప్రశ్నించారు. ఓడినా గెలిచినా మంథనిలోనే ఉంటున్నానని, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి మూడుసార్లు ఓడిపోయానని, అయినా ప్రజాధరన ఉందన్నారు. నియోజకవర్గంలో ఒక్కసారి ఎమ్మెల్యేగా పోటీ చేసిన వ్యక్తికి రెండోసారి టికెట్ రాకుండా దుద్దిళ్ల శ్రీధర్, ఆయన తండ్రి చేసేవారని, కానీ తమ అధినేత కేసీఆర్ తనకు మూడుసార్లు అవకాశం ఇచ్చాడని అన్నారు. దుద్దిళ్ల శ్రీధర్ కుటుంబం గొప్పదని చెప్తున్న మీడియా సంస్థలు ఐస్‌గడ్డతో గొంతు కోసే రకమని తెలుసుకోవాలని ఆయన హితవు పలికారు. మీడియా సంస్థలు తనపై విష పూరిత ప్రచారాన్ని మానుకోవాలని, నిజానిజాలు తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. మంథని నియోజకవర్గంలో శ్రీధర్ ఒక్కడే రాజకీయాల్లో ఉండాలని కొన్ని మీడియా సంస్థలు పని చేస్తుండటం భాదాకరమని ఆయన ఈసందర్భంగా స్పష్టం చేశారు.

# శృంగేరి పీఠం పర్యటన - ఆలయ అభివృద్ధి పురోగతి వివరాలను సీఎం కు నివేదించిన విప్ ఆది



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంగళవారం హైదరాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన ఆలయ అభివృద్ధి పురోగతితో పాటుగా జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. ఇటీవల శృంగేరి పీఠానికి చేసిన పర్యటన వివరాలను ముఖ్యమంత్రికి తెలియజేశారు. అలాగే ప్రస్తుతం ఆలయంలో అభివృద్ధి,విస్తరణ పనులు ప్రారంభమై ముమ్మరంగా కొనసాగుతున్నాయని వివరించారు. ఆలయ అభివృద్ధి వేగవంతం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

# ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత కీలక పాత్ర పోషించాలి

**- యూత్ కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గం అధ్యక్షులు : న్యాత నవీన్**

**- వట్టెంల గ్రామంలో యూత్ కాంగ్రెస్ నేతల ప్రత్యేక సర్వే - ఓటరు జాబితా పరిశీలన**





వేములవాడ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న "ఓటు చోరీ" కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేములవాడ రూరల్ మండలం,వట్టెంల గ్రామంలోని 146వ బూత్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేములవాడ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు న్యాత నవీన్ అధ్యక్షత వహించగా, వేములవాడ రూరల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రోమాల ప్రవీణ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల జాబితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాత నవీన్ మాట్లాడుతూ, "ప్రజలే నిజమైన రాజ్యాధికారులు. ప్రతి ఓటర్ వాస్తవాన్ని తెలుసుకొని,ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమవ్వాలి. ఈ కార్యక్రమం ద్వారా యువత, కార్యకర్తలు ఆ జాగ్రత్తపై దృష్టి సారించాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు,మాజీ ఎంపీపీ రంగు వెంకటేష్,గ్రామ శాఖ అధ్యక్షులు గుడిసె శంకర్, మండల యూత్ కో - ఆర్డినేటర్ గుడిసె ప్రసాద్, యూత్ కాంగ్రెస్ నాయకులు సందేల శశీ కుమార్, పాలకుర్తి సుమిత్, రోమాల ప్రశాంత్, బొడ్డు సుధీర్, సమల్ల గంగరాజుతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గణంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అసెంబ్లీ లాబీలో మహిళలతో దాండియా ఆడిన విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ లాబీలో బతుకమ్మ సంబరాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి ఆయన సరదాగా దాండియా ఆడుతూ బతుకమ్మ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. పూలనే పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక విశిష్టతకు ప్రతీక అని ఆది శ్రీనివాస్ తెలిపారు. మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ పండుగ రాష్ట్ర ప్రజల జీవితాల్లో సంతోషం నింపాలని ఆకాంక్షించారు.

# విద్య, క్రీడా ప్రతిభ కోసం కరాటే - బీసీ సంఘం నేతల ప్రోత్సాహం

**- కరాటే మెడల్స్ సాధించిన విద్యార్థులకు బీసీ సంఘం నేతల ఘన సన్మానం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) ఇటీవల కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన "సౌత్ ఇండియా చాంపియన్‌షిప్" కరాటే టోర్నమెంట్లో సుమారు 30 మంది ఓకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ విద్యార్థులు మెడల్స్ సాధించగా, బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహించే దిశగా విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సాధికారిత సంఘం గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండ దేవయ్య మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు విద్య ఎంత ముఖ్యమో, అలాగే ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవడం ఎంత అవసరమో తెలియజేశారు. "కరాటే విద్య తోపాటు సర్టిఫికెట్లను, మెడల్స్‌ను సాధించిన విద్యార్థులకు సరైన గుర్తింపు, ప్రాతినిధ్యం ఉండాలి" అని అన్నారు. కరాటే అసోసియేషన్ రాష్ట్ర మాస్టర్ అబ్దుల్ మన్నాన్ తన శిక్షణలో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో అనేకమంది విద్యార్థులు మెడల్స్ సాధించినట్లు తెలిపారు. సుమారు 60 మందికి పైగా బ్లాక్ బెల్ట్స్ కూడా సాధించినట్లు తెలిపారు. అనంతరం పొలాస నరేందర్ మాట్లాడుతూ విద్యార్థుల క్రీడా ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలి, అలాగే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కరాటే విద్యను మరింత ముందుకు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జిల్లా అధికార ప్రతినిధి మారం కుమార్, జిల్లా బీసీ నేతలు కూరగాయల కొమురయ్య, తుపుకారి సత్యయ్య, తోట రాజు, కుంభం రవి, ఇల్లందుల వెంకటేష్, ఇప్పపూల అజయ్,రామస్వామి గౌడ్, ఎట్టెం సాయికృష్ణ, చిలుక దేవయ్య తదితరులు పాల్గొన్నారు. కరాటే విద్యార్థులు కష్టపడి సాధించిన విజయాలను గుర్తించి, భవిష్యత్తులో మరిన్ని కీర్తులు సాధించాలని బీసీ సాధికారత సంఘం ఆశాభావం వ్యక్తం చేసింది.

# జీఎస్టీ తగ్గింపు - కేంద్రం చారిత్రక నిర్ణయం

**-వస్తు - సేవాపన్ను లో ఆర్థిక సంస్కరణలు**

**- బీజేపీ మండలాధ్యక్షులు : ఎడపల్లి పరశురాం**

**జిఎస్టీ తగ్గింపు మోదీ సాహసోపేత నిర్ణయం**

**భాజపా జిల్లా కౌన్సిల్ సభ్యులు : ఉదారి నరసింహా చారి**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక ఊతనిచ్చే దిశగా, భారత ప్రధాని నరేంద్ర మోడీ వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్లాబ్‌లను సవరిస్తూ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. కొత్త జీఎస్టీ స్లాబ్‌లు ఈనెల 22 నుండి అమలులోకి వచ్చాయి. ఈ సందర్భంగా బోయినిపల్లి మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఎడపల్లి పరుశురాం మాట్లాడుతూ, ఇప్పుడు రెండు ప్రధాన స్లాబ్‌లు ు 5 శాతం, 18 శాతం మాత్రమే ఉన్నాయని, విలాసవంతమైన వస్తువుల కోసం మాత్రమే అధిక రేటు కొనసాగుతుందని తెలిపారు.
సవరణల వల్ల ప్రభుత్వానికి సుమారు ఒక లక్ష కోట్లు ఆదాయ నష్టం సంభవించవచ్చని, అయినప్పటికీ, వినియోగం పెరగడం,పన్ను చెల్లింపులో క్రమశిక్షణ మెరుగవడం వల్ల రాష్ట్రాలు నికర లాభదారులుగా ఉంటాయని కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. పన్ను తగ్గింపుతో ఇంటి ఖర్చులు తగ్గి,చిన్న వ్యాపారాలకు వ్యాపార సౌలభ్యం ఏర్పడుతూ, ఉద్యోగావకాశాలు పెరుగుతాయని వివరించారు. అనంతరం భాజపా జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహా చారి మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ ప్రజల సంక్షేమాన్ని తాత్కాలిక ఆదాయ నష్టాల కంటే ప్రాధాన్యతనిస్తూ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని, ఈ "జీఎస్టీ తగ్గింపు" దీపావళి కానుకగా ప్రజల జీవన,వ్యాపార సౌలభ్యాలను మళ్లీ కాపాడినట్టు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో భాజపా పూర్వ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు బొంగాని అశోక్ గౌడ్, స్వామి కుమార్, సుంకపాక ప్రభు, మెరుపుల గంగాధర్, మిరియాల శరత్, సారంపల్లి రాజు, కందారపు వెంకటేష్,కళ్యాణం అనిల్, రాచర్ల రాజేశం, తదితర భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుక కోసం పిచ్చి మొక్కలు తొలగింపు



మంథని( ప్రశ్న న్యూస్) మంథని మున్సిపల్ పరిధిలోని బతుకమ్మ పండుగ వేడుక కోసం మంథని బిఆర్ఎస్ నాయకులు పిల్లి సత్తయ్య పిచ్చి మొక్కలు తొలగించారు. మంగళవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు మంథని మున్సిపల్ పరిధి పోచమ్మ వాడలోని ప్రజల కోరిక మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పిల్లి సత్తయ్య బతుకమ్మ, దసరా పండుగలు పురస్కరించుకొని తన సొంత ఖర్చులతో జెసిబి సహాయంతో పిచ్చి మొక్కలు తొలగించారు. బతుకమ్మ వేడుక కార్యక్రమానికి స్థలం శుభ్రం చేయించారు. తన సొంత ఖర్చులతో సేవ చేసినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద పండుగ బతుకమ్మ, బతుకమ్మ పండుగ ఆడబిడ్డలంతా ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆయన తెలిపారు. స్థానిక ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలను ముందస్తుగా తెలిపారు.

# కోర్టు ఆదేశంతో అక్రమ నిర్మాణం కూల్చివేత.

**మునిసిపల్ అధికారుల కను సన్నల్లో ఈ కార్యక్రమం.**



మంథని ( ప్రశ్న న్యూస్ ) మంథని మున్సిపల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన రెండంతస్తుల బిల్డింగును పోలీస్ బందోబస్తు మధ్య రెండు జెసిపిలతో మున్సిపల్ అధికారులు కోర్టు ఆదేశాల అనుసారం కూల్చివేశారు ఈ బిల్డింగు ఓల్లాల సత్యనారాయణ రైస్ మిల్లు యజమానిది వీరు పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించిన వారు

పట్టించుకోలేదని వారు విన్నవించారు కోర్టు ఆర్డర్ రాగానే ఈ బిల్డింగును కూల్చివేసామని మున్సిపల్ అధికారులు తెలియజేశారు మిగతా బిల్డింగులు కూడా కొన్ని ఉన్నాయని వాటికి కూడా కోర్టు ఆర్డర్ రాగానే వాటిని కూడా కూల్చివేస్తామని మునిసిపల్ అధికారులు ప్రజలకు తెలియజేశారు.

# చిన్న గల్లిలో 5 అంతస్తుల అక్రమ నిర్మాణం

- సికింద్రాబాద్ సర్కిల్లో ఏసీపీ మారిన ఆగని అక్రమ నిర్మాణాలు
- పత్రికలో కథనాలు వచ్చిన స్పందించని డిసి, ఏసిపి
- అక్రమాలను ప్రోత్సహించడానికి కొత్త పద్ధతులు వెతుకుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- అక్రమ నిర్మాణాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జెడ్ సి, జోనల్ సిపి
- జిహెచ్ఎంసి అవినీతికి కేంద్రంగా మారిన స్పందించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనుకడుగు వేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. గత అధికారులు సిబ్బంది చేసిన అవినీతి అక్రమాలు మాకు సంబంధం లేదంటూ ప్రస్తుతం విధులు నిర్వహించే టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బంది తెలపడం విస్మయాన్ని కలిగిస్తుంది. ఏ అధికారి చేసిన అవినీతి అక్రమాలు ఆ అధికారి ఆ సర్కిల్ పరిధిలో ఉన్నంతవరకే వారు బాధ్యులట తరువాత కొత్త అధికారి వచ్చిన తర్వాత వాటిపై చర్యలు తీసుకోరట మాకు సంబంధం లేదు అనడం ఎంతవరకు సమంజసం. పాత అధికారుల కనుసైగల్లో జరిగిన అక్రమాలపై ప్రస్తుతం కొత్తగా వచ్చిన అధికారులు సిబ్బంది చర్యలు తీసుకోలేమని లిఖితపూర్వకంగా రాసి ప్రజలకు ఇస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు. ఇలా జిహెచ్ఎంసిలో కొత్త కొత్త ఆలోచనలతో ఏసీపీలు, సెక్షన్ ఆఫీసర్లు, సిబ్బంది అక్రమ నిర్మాణాలను వెనకేసుకు రావడం ఏమిటని జిహెచ్ఎంసి ఆదాయానికి గండిపడుతున్న సీసీపీ, కమిషనర్ చర్యలు తీసుకోకుండా పత్రికలో వచ్చిన అవినీతి అక్రమాల కథనాలపై స్పందించకుండా నాకు సంబంధం లేదని చేతులెత్తేయడం ఏమిటో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో గతంలో పూర్తిస్థాయి ఏసీపి లేక ఇన్చార్జిల పరిధిలో అనేక అవినీతి అక్రమాలు జరిగాయి. వాటిపై ప్రస్తుతం ఏసీపీగా వచ్చిన పావని చర్యలు తీసుకుంటుందో లేదో అన్న సందేహం కలుగుతుంది. స్థానికుల ఫిర్యాదులు వచ్చిన చర్యలు తీసుకోకపోవడం ఏమిటని దానికి తోడు పత్రికలో కథనాలు వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్ స్పందించకపోవడం విడ్డూరంగా మారింది. బౌద్ధ నగర్, సీతాఫలమండి డివిజన్ ల పరిధిలోని బాపన్ బస్తీలో కనీసం ఐదు అడుగులు కూడా లేని గల్లీలో 12%-11-%135 లో 5 అంతస్తుల అక్రమ నిర్మాణం చేస్తున్నారని, అదేవిధంగా బౌద్ధ నగర్ డివిజన్ పరిధిలో పక్కింటి నెంబర్ 12%-11-%1153 అనుమతులు తీసుకొని 5 అంతస్తులు నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాలకు అసలు అనుమతులు ఉన్నాయా.? లేవా.? అన్నదానిపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత అధికారుల సిబ్బంది అవినీతికి ఈ అక్రమ నిర్మాణాలు నిదర్శనమని రెండు నోటీసులు ఇచ్చామని గతంలో అధికారులు తెలిపిన ఇచ్చారో లేదో అన్న విమానాలు వ్యక్తం అవుతుంది. దీనిపై వెంటనే ఏసీపీ పావని డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





## కొత్త కథలు సృష్టిస్తున్న డీసీలు, ఏసీపీలు..

మున్సిపల్ శాఖ అవినీతికి కేంద్రంగా మారింది అందులో టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ ఈ రెండు విభాగాలలో అవినీతి తీవ్రంగా ఉంటుంది. కానీ టౌన్ ప్లానింగ్ అవినీతి అక్రమాలు బయటికి కనిపిస్తాయి. ఇంజనీరింగ్ అధికారుల అవినీతి అక్రమాలు బయటికి కనిపించవు లోలోపలనే ఎప్పుడో కాంట్రాక్టర్లు ఏసీబీ ని ఆశ్రయిస్తే తప్ప ఇంజనీరింగ్ అధికారుల అవినీతి బయటపడదు. ఇక టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి అడుగడుగునా ఉంటుంది. అనుమతులు ఇవ్వడానికి లంచాలు, నిర్మాణ సమయంలో అక్రమ నిర్మాణం చేస్తే లంచాలు ఇలా వాళ్ళ ప్రతిరోజు లంచాల సొమ్ము లేనిదే ఇంటికి పోలేని పరిస్థితి. అలా డబ్బులు తీసుకెళ్లకుంటే కొంతమంది అధికారులకు, సిబ్బందికి నిద్ర కూడా పట్టదన్న ఆరోపణలు ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్లు ఏకమై అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ కోట్లు గడిస్తున్నారు. జిహెచ్ఎంసి అధికారానికి గండి కొడుతున్న జిహెచ్ఎంసి కమిషనర్, ప్రభుత్వము మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తుంది. ఒక సర్కిల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఏసిపి ట్రాన్స్ఫర్ అయిన తర్వాత కొత్తగా వచ్చిన ఏసీపీని గత అధికారి సమయంలో జరిగిన అక్రమ నిర్మాణాలపై వివరణ కోరితే గత అధికారులు ఏం చేశారు నాకు సంబంధం లేదు. ప్రస్తుతం నా టైంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై నన్ను అడిగితే చెబుతానని కొత్త కథలను వినిపించడం ప్రారంభించారు. గత అధికారి చేసిన అవినీతి అక్రమాలపై ప్రస్తుతం విధులు నిర్వహించే అధికారులు చర్యలు తీసుకోమంటూ చెప్పడం వాళ్ళ అవినీతి అక్రమాలకు పరాకాష్టగా మారింది. ఇలా కొత్త నిబంధనలను డీసీలు, ఏసీపీలు కలసి జిహెచ్ఎంసిలో తీసుకువస్తున్న పద్ధతులపై అవినీతి అధికారులపై వెంటనే జోనల్ కమిషనర్లు, కమిషనర్ కర్ణన్ చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో జిహెచ్ఎంసి అవినీతి ఇప్పటికే హద్దులు దాటిపోయింది. అవినీతిని కట్టడి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ మాటలకు అర్థం లేకుండా పోయింది. ఆయన వద్దనే ఉన్న మున్సిపల్ శాఖలో అవినీతి, అక్రమాలు తాండవిస్తుంటే ముఖ్యమంత్రి తన మాటలను మరిచిపోయినట్టున్నారు.

అందుకోసమే అవినీతి, అక్రమాలు ఇంత జరుగుతున్న జిహెచ్ఎంసిని కట్టడి చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలం చెందారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై నోడల్ అధికారి గా డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు కావడంతో కచ్చితంగా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని నిర్లక్ష్యం చేయవద్దని గత అధికారుల నిర్లక్ష్యానికి జిహెచ్ఎంసికి కోట్ల నష్టం వాటిలిందని స్థానికులు పేర్కొంటున్నారు. మరి ఈ అక్రమ నిర్మాణాలపై నోడల్ అధికారిగా డిసి ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# సర్వే నెంబర్ 61/లో అసలైన పట్టాదారి ఎవరు.?

- 1960 స నాటి భూమి ఇప్పుడు ఘర్షణాలు - సర్వే నెంబర్ 61 ఎంతమంది పట్టాదారులు
- కోట్ల విలువ చేసే భూమి ఇద్దరు మధ్య గొడవ - భూ కబ్జా దారు ఎవరు. అసలైన పట్టాదారు ఎవరు



**మేడిపల్లి (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపాలిటీ పరిధిలో ఇద్దరు మధ్య జరుగుతున్న భూమి తగాదాలు చిరికి చిరికి పెద్ద తుఫాన్ గా మారింది. మేడిపల్లి స్థానికులు, రాయలసీమ ప్రాంతానికి చెందినవారి మధ్య భూ సంబంధమైన గొడవలు తమకు చెందిన స్థలంలో ఇతరులు వచ్చి దౌర్జన్యం చేస్తున్నారని స్థానిక పోలీసుల చెంత కి చేరింది. కబ్జా చేస్తున్న వారికే పోలీసులు పూర్తి మద్దతు ఇస్తున్నారని బాధితులు వాపోయారు. వివరాల్లోకి వెళితే మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబరు 61/ లో అనిల్ సింగ్, డీ. వీరాచారి, మొహన్ రెడ్డి, తోటకూర వందర్ యాదవ్, వెంకటదారి అనే వ్యక్తులు 2017 లో భూమి పట్టదారులైన ఆశన్న, కన్న, వడ్డెన్నల ద్వారా 30 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోని అప్పటి నుండి కాంపౌండ్ వాల్ నిర్మాణం, విద్యుత్ మీటర్ ఏర్పాటు చేసుకుని అందులో వాచ్ మెన్ ను పెట్టి కబ్జాలో ఉన్నారు. ఇదే క్రమంలో కొందరు వ్యక్తులు శనివారం నాడు సుమారు 200 మంది సదరు స్థలానికి నేరుకుని తమ భూమి వద్ద పనిలో ఉన్న వాచ్ మెన్ పై దౌర్జన్యం చేస్తూ కాంపౌండ్ వాల్ లోనికి బలవంతంగా చోరబడ్డారని సమాచారం. రాయల సీమ వారు తమపై దౌర్జన్యానికి దిగారని "మేము రాయలసీమ వ్యక్తులం మా జోలికి వస్తే ఒక్కడిని వదిలేది లేదు" అంటు వీర శివ రెడ్డి అనే వ్యక్తి స్థానికులను భయభ్రాంతులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై స్థానిక మేడిపల్లి పీఎస్ లో ఫిర్యాదు చేస్తే సీఐ కనీసం స్పందించక పోగా కబ్జా చేస్తున్న వారికి పూర్తి స్థాయిలో మద్దతు ఇచ్చారని బాధితులు తమా బాధను వ్యక్తం చేశారు. పోలీసులు వాస్తవాలను తెలుసుకొని నిజమైన పట్టాదారులకు న్యాయం చేయాలని కానీ ఇక్కడ అలా జరగడం లేదని దీనిపై కమిషనర్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం తన భూమిలో అక్రమంగా ప్రవేశించిన వ్యక్తులకు ఈ భూమిపై ఏలాంటి అధికారం లేదని సర్వే నెంబరు కూడా పూర్తిగా తప్పని దీనిపై గతంలోనే న్యాయస్థానం, రెవెన్యూ అధికారులు, అప్పటి రంగారెడ్డి జిల్లా జేసీ వారి డాక్యుమెంట్లు జీపీఏ రద్దు చేసినట్లు ఉన్న ఉత్తర్వులను కూడా చూపించిన పోలీసులు పట్టించుకోవడం లేదని అన్నారు.

పీర్జాదిగూడ కార్పొరేషన్ కమీషనర్ ను కలిసి వివాదస్పద భూమిలో ఎలాంటి నిర్మాలు అనుమతులు ఇవ్వకూడదని గత జూన్ లో ఫిర్యాదు చేశామని కాసులకు కక్కుర్తి వడిన అధికారులు ఏలాంటి దర్యాప్తు లేకుండా తమ ఫిర్యాదును పరిగణలోకి తీసుకోకుండా నిర్మాణ అనుమతులు ఇచ్చారని దీనిపై మరోసారి ఫిర్యాదు చేశామని ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నిర్మాణం అనుమతులు రద్దు చేయాలని పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.

## మేం ఎవరికి వత్తాసు పలకడం లేదు..

మేడిపల్లి పోలీసు స్టేషన్ సీఐ ఆర్ గోవింద్ రెడ్డి భూ తగాదా విషయంలో మేం ఎవరికి అనుకూలంగా వ్యతిరేకంగా లేమని అనుమతులు తీసుకుని చేపట్టిన నిర్మాణాలను అడ్డుకుంటున్నారనే ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకొని అందరినీ శాంతింప చేశామని ఏమైనా వివాదాలు ఉంటే న్యాయస్థానాన్ని' ఆశ్రయించాలని సూచించామని సీఐ తెలిపారు.



# రక్త దాత సుఖీ భవ ...

## - కలెక్టర్ మెచ్చిన కౌన్సిలర్

- ఘనంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు జన్మదినోత్సవాలు
- రక్త దానం చేసిన మాజీ కౌన్సిలర్ పూదరి ప్రభాకర్
- సేవా భావంతో ముందుకొచ్చిన దాతలు



**మంచిర్యాల ( ప్రశ్న న్యూస్ )** మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు జన్మదినోత్సవాలు మంచిర్యాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్లో మెగా రక్త దానం ఏర్పాటు చేశారు. వందలాది మంది అభిమానులు, పార్టీ కార్యకర్తలు దాతలుగా రక్త దానం చేసి కొండంత ప్రేమను చాటుకున్నారు. ఈ సందర్భంగా 17వ వార్డు మాజీ కౌన్సిలర్, 39 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూదరి ప్రభాకర్ మెగా రక్త దానం శిబిరంలో పాల్గొన్నారు. అనంతరం రక్త దానం చేశారు.

దీంతో మొత్తంగా రికార్డు స్థాయిలో 21వసారి దాతగా నూతన చరిత్రను లిఖించారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్ , ప్రభాకర్ ను అభినందించారు. ఇదే స్ఫూర్తిగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ మధుసూదన్ రెడ్డి , ఓరియంట్ సిమెంట్ కంపెనీ ప్రెసిడెంట్ కొక్కిరాల సత్య పాల్ , బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ తిరుపతి పూదరి, టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ నరేష్ తో పాటు పార్టీ నాయకులు , కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

# దివ్యాంగులతో వారి తల్లిదండ్రులు, శుభోదయం సిబ్బంది బతుకమ్మ సంబరాలు



**ధర్పల్లి(ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలో గల శుభోదయం ఎన్ హెచ్ సి సెంటర్ లో మానసిక దివ్యంగుల తల్లి దండ్రుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ప్రొఫెషన్లల్స్ రేణుక స్పెషల్, ఏడ్యూ కేటర్ రాధిక, స్పీచ్ థెరపిస్ట్ లు సి సి బుచ్చన్న లు తల్లిదండ్రుల కి మాటల థెరపీ,వ్యక్తిగత, కార్యక్రమలు రోజు వారి కార్యక్రమల పైన సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో బతుకమ్మ పండుగ గురించి దివ్యంగులకు తెలిసేలా వారితో వారి పేరెంట్స్ తో చేపించి అట పాట లతో ఈ బతుకమ్మ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రొఫెషనల్స్ రెణుక, స్పెషల్ ఏద్యుకెటర్రాధికా, స్పీచ్ థెరపిస్ట్ లు, సి సి ఎన్ హెచ్ సి బుచ్చన్న, సెంటర్ కార్యకర్త నర్సవ్వ, సి బి ఆర్ స్వప్న హాజరు కావడం జరిగింది.

# నల్గొండ లిల్లీపుట్‌ను ఓడిస్తాం

## - బీఆర్ఎస్ నాలుగు ముక్కలు అయిందన్న కోమటిరెడ్డి



నల్గొండ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ పార్టీ రాజకీయ భవిష్యత్తుపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే నాలుగు ముక్కలైందని, అది మునిగిపోయిన పడవ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో నల్గొండ 'లిల్లీపుట్'ను కూడా ఓడించి తీరుతామని అన్నారు. నల్గొండ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ పని పూర్తిగా అయిపోయిందని, దాని గురించి ప్రజలు పట్టించుకునే స్థితిలో లేరని అన్నారు.ఈ సందర్భంగా నల్గొండ నియోజకవర్గ అభివృద్ధిపై ఆయన పలు హామీలు ఇచ్చారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను డబుల్ రోడ్లుగా విస్తరిస్తామని కీలక ప్రకటన చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందని దిశానిర్దేశం చేశారు. నల్గొండ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నూటికి నూరు శాతం మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ఆయన అన్నారు.

# భారత ఆటగాళ్లకున్న ధైర్యం మా వాళ్లకు లేదు

## - పాక్ బోర్డుపై అక్తర్ ఫైర్

**ఇస్లామాబాద్ (ప్రశ్న న్యూస్)** పాకిస్థాన్ క్రికెట్ జట్టును తిరిగి గాడిలో పెట్టేందుకు తన వద్ద స్పష్టమైన ప్రణాళిక ఉందని ఆ దేశ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ షోయబ్ అక్తర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఆసియా కప్ 2025లో టీమిండియా చేతిలో రెండుసార్లు ఓటమిపాలైన పాక్ జట్టుపై తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో అక్తర్ స్పందించాడు. భారత యువ ఆటగాడు అభిషేక్ శర్మకు లభిస్తున్న స్వేచ్ఛ, మద్దతు పాక్ ఆటగాళ్లకు కరవైందని, అందుకే వారు ఒత్తిడిలో విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.ఒక క్రీడా కార్యక్రమంలో షోయబ్ మాలిక్ అడిగిన ప్రశ్నకు అక్తర్ బదులిస్తూ, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తనకు అవకాశం ఇస్తే జట్టును బాగుచేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపాడు. అయితే, తాను సరైన నిర్ణయాలు తీసుకుంటాననే కారణంతో పీసీబీ తనను ఎప్పటికీ సంప్రదించదని ఆయన పరోక్షంగా బోర్డుపై విమర్శలు గుప్పించాడు. "నాకు అధికారం ఇవ్వమని అడగడం లేదు. నేను టీమ్‌వర్క్‌ను, తర్కాన్ని నమ్ముతాను. అందరం కలిసి పనిచేయాలి. నేను 20 మంది సభ్యులతో కూడిన సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేసి, వారి సలహాలు తీసుకుంటాను" అని అక్తర్ వివరించాడు.ఆటగాళ్లకు భరోసా ఇవ్వడమే తన ప్రథమ కర్తవ్యమని అక్తర్ స్పష్టం చేశాడు. ఈ సందర్భంగా యువ ఆటగాడు సైమ్ అయూబ్, భారత ఆటగాడు అభిషేక్ శర్మను ఉదాహరణగా చూపుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "నాకు మూడేళ్ల పాటు బాధ్యతలు అప్పగిస్తే, ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం నింపుతా. 'సైమ్ నువ్వు వెళ్లి స్వేచ్ఛగా ఆడుకో. అభిషేక్ శర్మకు ఆడేందుకు లైసెన్స్ ఉంది, నువ్వు కూడా అలాగే ఆడు. ఔటైనా నిన్ను జట్టు నుంచి తీసేయరు. ఈ ఏడాది మొత్తం నీదే' అని ధైర్యం చెబుతా మెరుగైన ప్రదర్శన ఎలా రాదో చూస్తా" అని అక్తర్ అన్నాడు. ప్రస్తుతం సైమ్ అయూబ్ విఫలమవుతాననే భయంతో ఆడుతున్నాడని, అదే అభిషేక్ శర్మ ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడుతున్నాడని అక్తర్ పోల్చాడు. పీఎస్ఎల్ వంటి లీగుల్లో పరుగులు చేయడం వేరని, అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడిని జయించి ఆడటమే అసలైన సవాలని అక్తర్ పేర్కొన్నాడు. అయితే, తన పిల్లలు చిన్నవారైనందున ఈ బాధ్యతలను చేపట్టే సమయంపై తనకు కొన్ని పరిమితులు ఉన్నాయని అక్తర్ వెల్లడించాడు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588